


Truth of News
# సూర్య వాస్తవం
RNI NO : APTEL/25/A0239
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య | సంచిక : 273 | గురువారం 26 మార్చి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# ఫైనాన్స్ బిల్లు ఆమోదం

- ఆదాయపు పన్ను విధానంలో మార్పులు
- ఆదాయపు పన్ను శాఖ అధికారులకు మరిన్ని అధికారాలు
- ఫైనాన్స్ బిల్లు నిబంధనలు కేవలం కార్పొరేట్లకు మాత్రమే సహాయపడతాయి: ప్రతిపక్షాలు



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:**

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 32 సవరణలతో కూడిన ఫైనాన్స్ బిల్లు-2026ను లోక్‌సభ ఆమోదించింది. ఫైనాన్స్ బిల్లు ఆమోదంతో లోక్‌సభలో బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తయింది. ఈ బిల్లును గురువారం రాజ్యసభ పరిశీలించనుంది. రాజ్యసభ ఫైనాన్స్ బిల్లును ఆమోదించడంతో, 2026-2027 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ సిఫారసులకు చట్టబద్ధమైన ఆమోదం లభిస్తుంది. ఫైనాన్స్ బిల్లు ఆమోదంతో దేశ ఆదాయపు పన్ను విధానంలో గణనీయమైన మార్పులు రానున్నాయి. ఆదాయపు పన్ను శాఖ అధికారులకు

- మిగతా 2లో..

# ప్రధాని మోడీ డుమ్మా

- అఖిలపక్ష సమావేశానికి గైర్హాజరు.. నిలదీసిన ప్రతిపక్ష నేతలు
- స్పష్టమైన వివరణ ఇవ్వలేదు : ప్రతిపక్ష నేతలు
- దేశంలో ఇంధన సంక్షోభం లేదు : కేంద్రం



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:**

పశ్చిమాసియా సంఘర్షణ, ఇంధన సంక్షోభం వంటి అంశాలపై చర్చించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్షం సమావేశానికి ప్రధాని మోడీ డుమ్మా కొట్టారు. కీలకమైన సమావేశానికి ప్రధాని గైర్హాజరు కావడంపై సమావేశంలో కేంద్ర మంత్రులను ప్రతిపక్ష నేతలు నిలదీశారు. కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం 1.45 గంటల పాటు జరిగింది. కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, ఎస్. జైశంకర్, కిరణ్ రిజిజు, హర్దీప్ సింగ్ పూరి, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీలు పాల్గొన్నారు. పశ్చిమాసియా సంఘర్షణ నేపథ్యంలో కూడా దేశంలో ఇంధన సంక్షోభాన్ని నివారించడానికి అన్ని చర్యలూ తీసుకున్నామని సమావేశంలో కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది.

అలాగే దేశంలో ఇంధన సంక్షోభం లేదని తన వాదనను పునరుద్ఘాటించింది. ”తగినంత నిల్వలు ఉన్నాయి. రాబోయే రోజుల్లో నాలుగు లేదా ఐదు నౌకలు భారతదేశానికి రానున్నాయి. ఎక్కడా కొరత గానీ, సరఫరా సమస్య గానీ లేదు. ప్రస్తుతం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు” అని కేంద్రమంత్రులు హామీ ఇచ్చారు.

- మిగతా 2లో..

## 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు

### - సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:**

ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గేయం 'వందేమాతరం' పాడాలంటూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఆ సర్క్యులర్ కేవలం సలహా పూర్వకమైనదే తప్ప, తప్పనిసరి కాదని స్పష్టం చేసింది. అందులో ఎలాంటి శిక్షార్హమైన చర్యలు పేర్కొననందున, ఈ పిటిషన్‌పై విచారణ తొందరపాటు అవుతుందని అభిప్రాయపడింది. భారత ప్రధాన న్యాయ మూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ ఏడాది జనవరి 28న కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ కేవలం సలహా మాత్రమేనని, దాన్ని పాటించకపోతే శిక్షలు ఉంటాయని ఎక్కడా చెప్పలేదని ధర్మాసనం పేర్కొంది. “ఒకవేళ శిక్షార్హమైన చర్యలు తీసుకుంటే లేదా దీన్ని తప్పనిసరి చేస్తే అప్పుడు విచారిస్తాం. ప్రస్తుతానికి ఇందులో అలాంటివేమీ లేవు” అని కోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే, సర్క్యులర్‌లో శిక్షలు లేకపోయినా ఇది పరోక్ష ఒత్తిడికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వందేమాతరం

- మిగతా 2లో..

## ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా,

# నియోజకవర్గాల పునర్విభజన..

- వాస్తవిక దృక్పథంతో ముందుకు సాగాలి
- జనసేన ఎమ్మెల్యేలతో సమావేశంలో పవన్ కల్యాణ్ ఆసక్తికర వ్యాఖ్యలు



**అమరావతి - సూర్య వాస్తవం:**

జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్)పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రక్రియలో ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా, వాస్తవిక దృక్పథంతో ముందుకు సాగాలని ఆయన స్పష్టం చేశారు. జనసేన శాసనసభాపక్ష (జేఎల్‌పీ) సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2009లో జరిగిన పునర్విభజన అనుభవాలను గుర్తుంచుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు గణనీయంగా పెరుగుతాయని పవన్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలను 50 శాతం పెంచడాన్ని స్వాగతించారు. దీనివల్ల రాష్ట్రంలో 88 అసెంబ్లీ, 12 పార్లమెంట్ స్థానాలు పెరిగి, దాదాపు 100 మందికి కొత్తగా రాజకీయ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా, సహేతుకంగా జరగాలని, ఎక్కడా దుర్వి నియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నొక్కిచెప్పారు. ప్రజాప్రతినిధులు అన్ని వర్గాలకు చేరువగా ఉంటూ దీర్ఘకాలిక అభివృద్ధిపై దృష్టి సారించాలని ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. డీలిమిటేషన్‌పై పార్టీ కార్యాచరణను ఖరారు చేసేందుకుగాను, ఎమ్మెల్యేలతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు పవన్ సూచించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా పార్టీ తన తుది వైఖరిని నిర్ణయిస్తుందని తెలిపారు.



## చంద్రబాబుకు భయపడొద్దు..

### - ఆ రోజులు పోయాయి: జగన్

**అద్దంకి - సూర్య వాస్తవం:**

వైసీపీ అధినేత జగన్ ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గ పార్టీ నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వంపై, ముఖ్యంగా సీఎం చంద్రబాబుపై ఆయన నిప్పులు చెరిగారు. పాలనలో అంతా తనదే అన్నట్టుగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, ప్రతి చిన్న విషయంలో 'క్రెడిట్ చోరీ'

- మిగతా 2లో..

## స్వర్ణ కుప్పం చేయడమే

# చంద్రబాబు లక్ష్యం

- కుప్పానికి పరిశ్రమల రాకతో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా సీఎం చంద్రబాబు అడుగులు
- యువత స్వశక్తితో ఎదగాలి, కష్టాన్ని నమ్ముకుంటే ఏదైనా సాధించవచ్చు
- 2వ రోజు కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి

**కుప్పం- సూర్య వాస్తవం:**

స్వర్ణ కుప్పం లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమా లు అమలు చేస్తున్నారని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా 2వ రోజు పలు గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటించారు. బుధవారం కుప్పం డిగ్రీ కాలేజ్ లో నిర్వహించిన జాబ్ మేళాలో ఆమె పాల్గొన్నారు. గుడిపల్లి మండలం పెద్ద కోటమకనపల్లి గ్రామంలో ఆమె పర్యటించి మహిళలతో సమావేశమయ్యారు.



**వినూత్న ఆలోచనలతోనే నూతన ఆవిష్కరణలు**

బుధవారం కుప్పం డిగ్రీ కాలేజీలో నిర్వహించిన జాబ్ మేళాలో నారా భువనేశ్వరి

- మిగతా 2లో..




## 28న అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

**అమరావతి - సూర్య వాస్తవం**

రాష్ట్ర అసెంబ్లీ ఈ నెల 28న (శనివారం) ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సమావేశంలో సిఆర్‌డిఎ-2014కు సవరణ చేసి, అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటిస్తూ తీర్మానం చేయనున్నారు. అనంతరం ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు కేంద్రం సానుకూలంగా ఉందని, చట్టపరమైన ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రం చేసిన సూచన మేరకు ఈ తీర్మానాన్ని చేసి పంపుతున్నట్లు చెబుతున్నారు.

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# 'వందేమాతరం' పాడటం తప్పనిసరి కాదు

(మొదటి పేజీ తరువాయి)
పాడటానికి లేదా గౌరవ సూచకంగా నిలబడటానికి నిరాకరించే వారు సామాజిక వివక్షను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. "దేశభక్తిని బలవంతంగా రుద్దలేరు. వ్యక్తిగత అంతరాత్మను కాపాడాల్సిన బాధ్యత రాజ్యాంగంపై ఉంది" అని ఆయన నివేదించారు. అయితే, పిటిషనర్ వ్యక్తం చేస్తున్న ఆందోళనలు ప్రస్తుతానికి ఊహాజనితమేనని ధర్మాసనం అభిప్రాయపడింది. ఒకవేళ ఎవరిపైనైనా శిక్షార్హమైన చర్యలు తీసుకున్నా లేదా వివక్ష చూపినా, అప్పుడు మళ్లీ కోర్టును ఆశ్రయించవచ్చని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. విద్యాసంస్థలు, బహిరంగ సభల్లో వందేమాతరం పాడాలని కేంద్రం సర్క్యులర్‌లో సూచించింది. ఇది కేవలం జాతీయ గేయంపై గౌరవాన్ని పెంపొందించడానికేనని, చట్టబద్ధంగా అమలు చేయాలనే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వందేమాతరం స్ఫూర్తి గురించి ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో ప్రస్తావించడం గమనార్హం. బంకించంద్ర చటోపాధ్యాయ 1875లో రచించిన ఈ గేయం, స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై నడిపించిందని కొనియాడారు. రవీంద్రనాథ్ ఠాగూర్ స్వరపరిచిన ఈ గీతాన్ని 1896లో కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఆలపించారు. 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ దీనికి జాతీయ గేయం హోదా కల్పించారు.

# చంద్రబాబుకు భయపడొద్దు..

(మొదటి పేజీ తరువాయి)
చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ మన హయాంలోనే రాష్ట్రానికి వచ్చిందని, కానీ ఇప్పుడు తన వల్లే వచ్చినట్టుగా చంద్రబాబు 'బిల్డప్' ఇస్తున్నారని జగన్ ఎద్దేవా చేశారు. గూగుల్ విషయంలోనూ ఇదే జరిగిందని, మాటలు కోటలు దాటుతున్నా చేతల్లో ఏమీ లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో పార్టీని సరికొత్తగా తీర్చిదిద్దుతామని, 'జగన్ 2.0'లో కార్యకర్తలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారు. నేతలెవరూ చంద్రబాబును చూసి భయపడాల్సిన అవసరం లేదని, ఆ రోజులు పోయాయని ధైర్యం చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుండటం పార్టీకి మంచి పరిణామమని జగన్ అభిప్రాయపడ్డారు. దీనివల్ల మహిళా రిజర్వేషన్లు అమల్లోకి వస్తాయని, గతంలో తాము పదవులు, కాంట్రాక్టుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు చట్టసభల్లో కూడా మన మహిళలకు మరిన్ని అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు.

# హెబియస్ కార్పస్ పిటిషన్ కొట్టివేత

**అమరావతి - సూర్య వాస్తవం**




మేజర్ యువతి తనకు నచ్చిన వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుని భర్తతో కలిసి ఉంటే అది అక్రమ సంబంధం కిందకు రాదని హైకోర్టు పేర్కొంది. దీనిపై హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయడానికి వీల్లేదంది. తన కుమార్తెను ఆనందబాబు అనే వ్యక్తి అక్రమంగా నిర్బంధించారని ఆ యువతి తల్లిదండ్రులు వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రారు, జస్టిస్ గేదెల తుహిన్ కుమార్‌తో కూడిన ధర్మాసనం కొట్టేస్తూ తీర్పు చెప్పింది. అమరావతి విట్ విద్యా సంస్థలో బిటెక్ రెండో ఏడాది చదువుతున్న తమ కుమార్తె ఆచూకీ తెలియడం లేదంటూ ఆమె తల్లిదండ్రులు పిటిషన్ వేశారు. రోజువారి కూలీ అయిన ఆనందబాబు అనే వ్యక్తి అక్రమంగా నిర్బంధించారని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు యువతిని కోర్టులో హాజరుపర్చారు. యువతి మైనర్‌గా ఉన్నప్పుడు ఆనందబాబు అత్యాచారం చేశాడని, గర్భస్రావం చేసిన ఆధారాలు ఉన్నాయని తల్లిదండ్రులు చెప్పారు. ఆ యువతి తాను ఆనందబాబును ప్రేమించినట్లు, ఇద్దరూ ఇష్ట ప్రకారమే పెళ్లి చేసుకున్నట్లు తెలిపింది. ఆమె కోరిక మేరకు ఆనందబాబుతో ఉండేందుకు ధర్మాసనం అనుమతినిచ్చింది. పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పు చెప్పింది.

# బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు : మంత్రి సవిత

**అమరావతి - సూర్య వాస్తవం**



బిసి హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. మరో రెండు నెలల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్మాణాలు, ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటు వంటి చర్యలను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బిసి సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హాస్టళ్లలోకి దోమలు రాకుండా దోమల నెట్‌లు, పరిశుద్ధమైన తాగునీరు అందించేందుకు ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే 10 ఎంజెపి స్కూళ్లను వచ్చే విద్యా సంవత్సరానికి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిసి హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ఆదరణ 3.0 పథకం అమలుపై తీసుకుంటున్న చర్యలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో బిసి సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్ సత్యనారాయణ, ఎంజెపి స్కూళ్ల కార్యదర్శి మాధవీలత, అడిషనల్ డైరెక్టరు చంద్రశేఖర్‌రాజు, బిసి కార్పొరేషన్ జిఎం భీమశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ డుమ్మా

(మొదటి పేజీ తరువాయి)
అయితే ప్రతిపక్షాలు లేవనెత్తిన కీలక అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వలేదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్‌ల దురాక్రమణను వ్యతిరేకించని కేంద్ర ప్రభుత్వం.. దౌత్యం అంటే మౌనంగా ఉండటమేననే అభిప్రాయాన్ని కలిగించేం దుకు ప్రయత్నిస్తోందని సీపీఐ(ఎం) రాజ్యసభ నేత జాన్ బ్రిట్టాస్ ఎద్దేవా చేశారు. "అమెరికా ఏకపక్ష, క్రూరమైన దురాక్రమణను ఖండించని కేంద్ర ప్రభుత్వం, జీసీసీ దేశాలపై జరిగిన దాడులను ఖండిస్తూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానానికి గట్టిగా మద్దతు తెలిపింది. బ్రిక్స్ కూటమికి నాయకత్వం వహిస్తున్న దేశంగా భారతదేశం స్పందన అత్యంత నిరాశపరిచింది. దేశంలో ఇంధన సంక్షోభం లేదని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, దానిని నిరూపించే నివేదికలు ఒక్కటి కూడా రావడం లేదు. వాస్తవం ఏమిటంటే, అన్ని రాష్ట్రాలూ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఎల్పీజీ సంక్షోభాన్ని పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. బ్లాక్ మార్కెటింగ్, నిల్వలను అరికట్టలేకపోతోంది. పాశ్చాత్య దేశాలలో కోటి మందికి పైగా భారతీయులు ఉన్నారు. వారి భద్రతను నిర్ధారించడానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంది? యుద్ధ భయంతో తిరిగి వచ్చిన వారికి సహాయం చేయడానికి పునరావాస ప్యాకేజీని ఎందుకు రూపొందించలేదు?" అని జాన్ బ్రిట్టాస్ ప్రశ్నించారు. పశ్చిమాసియా సంఘర్షణలపై కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్న అభిప్రాయం తప్పు అని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ బదులిచ్చారు. ప్రభుత్వం ప్రతిరోజూ అధికారికంగా స్పందించిందని, దేశాధినేతలతో సంప్రదింపులు జరిపిందని ఆయన తెలిపారు. మొన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేసినప్పుడు, యుద్ధం వీలైనంత త్వరగా ముగియాలని తాను కోరుకుంటున్నట్టు ప్రధాని తన వైఖరిని స్పష్టం చేశారని జైశంకర్ అన్నారు. ఇరాన్, అమెరికా మధ్య చర్చలలో పాకిస్తాన్ మధ్యవర్తిత్వం పెద్ద విషయమేమీ కాదని అన్నారు. "1981 నుంచి పాకిస్తాన్ అనేక విషయాలపై ఇరాన్, అమెరికాల మధ్య మధ్యవర్తిత్వం వహిస్తూనే ఉంది. అందువల్ల, ఇది కొత్త విషయం కాదు. సంఘర్షణను ముగించడానికి పాకిస్తాన్ మధ్యవర్తిత్వం వహించడం కేంద్ర ప్రభుత్వ దౌత్య వైఫల్యం అనే ఆరోపణలు తప్పు. ఒకవేళ అదే నిజమైతే, అది 1981 నుంచే ప్రారంభమైన దౌత్య వైఫల్యం" అని జైశంకర్ తెలిపారు. మరింత ప్రాణనష్టం జరగకుండా వీలైనంత త్వరగా యుద్ధం ముగియాలన్నది భారతదేశ వైఖరని చెప్పారు. ఈ వైఖరిని ప్రధాని అమెరికా అధ్యక్షుడికి స్పష్టం చేసినట్టు వివరించారు. ఏ విషయం పైనైనా ప్రతిపక్షాలతో చర్చలు జరపడానికి తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేతలు ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, ఎస్పీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, జావెద్ అలీ, ఎల్జేపీ నేత అరుణ్ భారతి, డీఎంకే ఎంపీ పి.విల్సన్, ఆప్ ఎంపీ సంజయ్ సింగ్, జెడియు నేత రాజీవ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**సంతృప్తికరంగా లేదు: తారిఖ్ అన్వర్**

అఖిలపక్ష సమావేశం సంతృప్తికరంగా జరగలేదని కాంగ్రెస్ నేత తారిఖ్ అన్వర్ అన్నారు. తాము ప్రభుత్వం నుంచి వివరణ కోరేందుకు ప్రయత్నించామని, కానీ స్పష్టమైన వివరణ రాలేదని అన్నారు. ఈ అంశంపై రాజ్యసభ, లోక్‌సభ రెండింటిలోనూ రూల్ 193, 170 కింద చర్చ జరగాలన్నది తమ డిమాండ్ అని అన్నారు. ప్రభుత్వం చెబుతోంది యుద్ధం వద్దని, కానీ కేవలం అలా చెప్పడం వల్ల వచ్చే ప్రయోజనం ఏమీ లేదని తెలిపారు. వాస్తవమేమిటంటే, ఇప్పటికే ఘర్షణ మొదలైందని, పాకిస్తాన్ మధ్యవర్తిగా వ్యవహరిస్తూ ఆ పాత్రను పోషిస్తుండగా, మనం నిశ్శబ్దంగా ప్రేక్షకులుగా మిగిలిపోయామని అన్నారు.

# ఫైనాన్స్ బిల్లు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)
మరిన్ని అధికారాలు లభిస్తాయి. ఎటువంటి కాలపరిమితి లేకుండా పాత ఆదాయపు పన్ను మదింపు కేసులను కూడా తిరిగి తెరిచే అధికారం అధికారులకు ఉంటుంది. సాంకేతిక సమస్యల కారణంగా కోర్టులు లేదా ట్రిబ్యునల్స్ ద్వారా చెల్లనివిగా ప్రకటించబడిన కేసులలో విచారణను పున్రప్రారంభించడానికి సహాయ పడే నిబంధనలు కొత్త ఫైనాన్స్ బిల్లులో ఉన్నాయి. ఇది కోర్టులను తప్పించుకునే చర్య అని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఫైనాన్స్ బిల్లులోని నిబంధనలు కేవలం కార్పొరేట్లకు మాత్రమే సహాయపడతాయని ప్రతిపక్షాలు ఆరోపించాయి.

**లోక్‌సభలో ఎఫ్సీఆర్ఏ సవరణ బిల్లు**

లోక్‌సభలో విదేశీ విరాళాలు (నియంత్రణ) చట్టాన్ని సవరించడానికి ఉద్దేశించిన బిల్లును బుధవారం కేంద్ర హోం సహాయ మంత్రి నిత్యానంద్ రారు ప్రవేశపెట్టారు. ఈ బిల్లు పారదర్శకతను పెంచడానికి, విదేశాల నుంచి వచ్చిన నిధుల సరైన వినియోగాన్ని నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. విదేశీ నిధులతో బలవంతపు మత మార్పిడులకు పాల్పడే వ్యక్తులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. ఈ బిల్లు ప్రమాదకరమైనదని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. బిల్లు ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్ష సభ్యులు వ్యతిరేకించారు. దీనిద్వారా సర్వఅధికారాలు కేంద్ర ప్రభుత్వానికి అప్పగించబడుతున్నాయని, ఈ బిల్లు క్రూరమైనదని పేర్కొన్నారు. ఎలాంటి రాజ్యాంగ రక్షణ లేకుండా కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణ అధికారం లభిస్తుందని ప్రతిపక్ష ఎంపిలు పేర్కొన్నారు. ఈ బిల్లు అధికార కేంద్రీకరణను నిర్ధారిస్తుందని స్పష్టం చేశారు.

**రాజ్యసభలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల బిల్లు**

అలాగే రాజ్యసభలో కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సాధారణ పరిపాలన) బిల్లును ప్రవేశపెట్టారు. కేంద్ర సాయుధ బలగాల నాయకత్వంలో ఐపిఎస్ అధికారుల నియామకానికి సంబంధించిన నిబంధనలు ఉన్న ఈ బిల్లును ప్రతిపక్షం తీవ్రంగా వ్యతిరేకించింది. 2025 నాటి సుప్రీంకోర్టు ఉత్తర్వును ఉల్లంఘించే ఉద్దేశంతోనే ఈ బిల్లును తీసుకువచ్చారని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాలలో ఐపిఎస్ అధికారుల డిప్యుటేషన్‌ను తగ్గించాలన్నది సుప్రీంకోర్టు ఉత్తర్వు. అయితే ఈ కొత్త బిల్లుతో సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్బీ, సీఐఎస్ఎఫ్ వంటి కేంద్ర సాయుధ బలగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువస్తామని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

**రాజ్యసభలో ట్రాన్స్‌జెండర్ వర్గం హక్కులను ఉల్లంఘించే బిల్లు ఆమోదం**

ట్రాన్స్‌జెండర్ వర్గం హక్కులను ఉల్లంఘించే వివాదాస్పద సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. ప్రతిపక్షాల తీవ్ర నిరసనల మధ్య, మంగళవారం లోక్‌సభ, బుధవారం రాజ్యసభ ఈ బిల్లును ఆమోదించాయి. ఈ బిల్లు 'ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ) చట్టం, 2019'కి ప్రధాన సవరణలు చేయాలని కోరుతోంది. ఈ బిల్లును ఒక ప్రత్యేక కమిటీకి పంపాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను తిరస్కరిస్తూ, రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. ఈ బిల్లు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల స్వీయ-నిర్ణయాధికారాన్ని ఉల్లంఘిస్తుందని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. ఈ కొత్త బిల్లులో అనేక వివాదాస్పద నిబంధనలు ఉన్నాయి. వాటిలో 'తమ సొంత నమ్మకాల ఆధారంగా తమ లింగ గుర్తింపును నిర్ణయించుకునే వారిని' ట్రాన్స్‌జెండర్ నిర్వచనం నుండి మినహాయించడం కూడా ఒకటి. కొత్త సవరణ ప్రకారం, ఒక వ్యక్తి ట్రాన్స్‌జెండర్ అని ధ్రువీకరించే సర్టిఫికేట్‌ను, చీఫ్ మెడికల్ ఆఫీసర్ లేదా డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నేతృత్వంలోని వైద్య బోర్డు సిఫార్సు మేరకు జిల్లా మేజిస్ట్రేట్ జారీ చేయాలి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్రపాలిత ప్రాంత పరిపాలన యంత్రాంగం వైద్య బోర్డులను ఏర్పాటు చేస్తాయి. వైద్య మండలి సిఫార్సు విశ్వసనీయంగా లేకపోతే, జిల్లా మేజిస్ట్రేట్ ఇతర నిపుణులను పరీక్షలు నిర్వహించమని కూడా ఆదేశించవచ్చు. ట్రాన్స్‌జెండర్ సమాజంతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా చట్టానికి సవరణ తీసుకురావడం ఆమోదయోగ్యం కాదని ప్రతిపక్ష సభ్యులు పేర్కొన్నారు. ఈ సవరణలో, గౌరవప్రదంగా జీవించడానికి రాజ్యాంగం వాగ్దానం చేసిన హక్కులను ట్రాన్స్‌జెండర్ సమాజానికి నిరాకరించే నిబంధనలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం, దేశంలో సుమారు ఐదు లక్షల మంది ట్రాన్స్‌జెండర్లు ఉండగా, కేవలం 32,000 మంది మాత్రమే గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

వీరిలో 31 శాతం మంది ఆత్మహత్యకు ప్రయత్నించారని అంచనా. వీరిలో 50 శాతం మంది 20 ఏళ్లలోపు వయసులోనే ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఈ గణాంకాలు దేశంలో ట్రాన్స్‌జెండర్ సమాజం ఎదుర్కొంటున్న భారీ సవాళ్లను స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటికే తీవ్ర సంక్షోభాలు, వివక్షను ఎదుర్కొంటున్న సమాజాన్ని ఈ కొత్త సవరణ మరింతగా ఏకాకిని చేస్తుందని కూడా ప్రతిపక్షం ఆరోపించింది.

# స్వర్ణ కుప్పం చేయడమే చంద్రబాబు లక్ష్యం






(మొదటి పేజీ తరువాయి)
పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి. భవిష్యత్ పై స్పష్టత ఉండాలి. యువత స్వశక్తితో ఎదగాలి. కష్టాన్ని నమ్ముకోవాలి. లక్ష్యం ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. నాడు విజన్ 2020, నేడు విజన్ 2047 లక్ష్యంతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారు. ఒక నాయకుడిని నమ్మి ఓటేస్తే ఏం జరిగిందో గత ఐదేళ్లలో మనం చూశాం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట తప్పరు. ఓట్ల కోసం హామీలు ఇవ్వరు. ప్రజల కోసం నిలబడతారు. నేను ఏం చేయగలనో అదే హామీ ఇస్తానని చంద్రబాబు నాతో చెబుతూ ఉంటారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నారు. 20 లక్షల ఉద్యోగ కల్పన లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. గృహిణిగా ఉన్న నేను హెరిటేజ్ బాధ్యతలను సవాల్ గా తీసుకున్నాను. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి. ప్రతి దానికీ అసంతృప్తికి లోను కాకూడదు. కష్టపడి పనిచేస్తే ఎన్నో అవకాశాలు వస్తాయి. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తారు. ప్రయోజకులు కావాలని , భవిష్యత్ బాగుండాలని తాపత్రయపడతారు. పిల్లలు జీవితంలో ఉన్నతంగా స్థిరపడితే ముందుగా సంతోషించేది తల్లిదండ్రులే. చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటంతో నా కుమారుడు లోకేష్ పెంపకం, చదువు బాధ్యత నేనే చూసుకున్నాను. ఏది మంచి, ఏది చెడు అనేది చెప్పి పెంచానని నారా భువనేశ్వరి అన్నారు. జాబ్ మేళా సందర్భంగా పలు కంపెనీల ప్రతినిధులతో భువనేశ్వరి సమావేశమయ్యారు.

**పరిశ్రమల రాకతో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు**

గుడిపల్లి మండలం పెద్ద కోటమనపల్లి గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరి మహిళలతో సమావేశమయ్యారు. మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. చంద్రబాబుని 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బిజీగా ఉండటంతో ప్రతి మూడు నెలలకు ఒకసారి నేను కుప్పం నియోజకవర్గంలో పర్యటిస్తున్నాను. ప్రజల సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తున్నాను. రాష్ట్రాన్ని బాగుచేయడం చంద్రబాబు వల్లే సాధ్యమని ప్రజలు నమ్మి ఓటేశారు. కుప్పం నియోజకవర్గానికి రూ. 7,121 కోట్ల విలువైన పెట్టుబడులతో 17 పరిశ్రమలు తీసుకొచ్చారు. వీటి ద్వారా పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుంది. కుప్పంలో అడిడాస్ కంపెనీ ఫుట్ వేర్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. కుప్పంలో సోలార్ ఎనర్జీ వినియోగం పెంచేందుకు చర్యలు చేపట్టారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కుప్పం డిగ్రీ కాలేజ్ లో జాబ్ మేళా సందర్భంగా 5 వేల ఉద్యోగాల కల్పనకు పలు కంపెనీలు ముందుకొచ్చాయి. నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం కింద 37, 824 మంది లబ్ధి పొందుతున్నారు. 42, 232 మందికి తల్లికి వందనం అందుతోంది. స్వచ్ఛ కుప్పంలో భాగంగా చెత్త నుంచి సంపద సృష్టించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రహదారుల నిర్మాణం చేపట్టారు. స్వర్ణ కుప్పంలో భాగంగా సీసీ, బీటీ రోడ్లు వేస్తున్నారు. సంజీవని హెల్త్ క్లినిక్స్ ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నారు. కుప్పానికి హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకొచ్చారు. గతంలో కొందరు చంద్రబాబుపై నిందలు మోపారు. గత ప్రభుత్వంలో చంద్రబాబుని అక్రమంగా అరెస్ట్ చేశారు. యావత్ రాష్ట్ర ప్రజలు చంద్రబాబు కి అండగా నిలబడ్డారు. మద్దతుగా మహిళలు పెద్ద ఎత్తున బయటకు వచ్చి పోరాడారని నారా భువనేశ్వరి అన్నారు. అంతకుముందు స్థానిక మహిళలతో కలిసి నారా భువనేశ్వరి కోలాటం ఆడారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీ ఎస్ ఆర్ టి సి వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, డిఎంకె ఉడా చైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్ బాబు, ఇతర నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బెంగాల్ గేమ్ ఛేంజర్ అవుతుందా

2021 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రభావం ఇప్పటికీ ఆ రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై గట్టిగానే కనిపిస్తోంది. అయితే అది కేవలం గతం జ్ఞాపకంగా నిలిచిపోలేదు; 2026 ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అది మారుతూ, మరింత స్పష్టమైన సూచనగా కనిపిస్తోంది. ఒకప్పుడు అనేక పార్టీల మధ్య జరిగిన పోటీ, గత దశాబ్దంలో క్రమంగా కుదించుకుపోయి, ఇప్పుడు ప్రధానంగా తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), భారతీయ జనతా పార్టీ (బిజెపి) మధ్య ద్విపాక్షిక పోరాటంగా మారింది. ఇదే సమయంలో వామపక్షాలు తమ రాజకీయ ప్రాధాన్యాన్ని తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, వాటి విజయాలు పరిమితంగానే ఉన్నాయి. ఇప్పుడు ప్రధాన ప్రశ్న ఎవరు ముందుంటారు అనేది మాత్రమే కాదు; 2021లో ఏర్పడిన రాజకీయ సమతుల్యత స్థిరమా లేక సున్నితమైనదా అనేదే కీలకం. 2021 ఎన్నికల ఫలితం చూస్తే అది స్పష్టమైన విజయం. మమతా బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి మూడింట రెండు వంతుకుపైగా అసెంబ్లీ స్థానాలు గెలుచుకుని, దాదాపు సగం ఓట్లను సంపాదించింది. అయితే ఆ విజయంలో ఒక ముఖ్యమైన మార్పు కూడా దాగి ఉంది. బిజెపి అట్టడుగు స్థాయినుంచి ఎదిగి, ఒక బలమైన ప్రతిపక్షంగా మారింది. దాదాపు ఐదో వంతులో రెండో వంతు ఓట్లను సంపాదించి, వామపక్ష, కాంగ్రెస్ కూటమిని పక్కకు నెట్టింది. ఈ మార్పు ప్రాధాన్యం చాలా గొప్పది. ఎన్నాళ్లుగా సిద్ధాంతపరమైన పోటీలు, వర్గాల పొత్తు రాజకీయాలతో సాగిన బెంగాల్ రాజకీయాలు, ఇప్పుడు రెండు వేర్వేరు రాజకీయ విధానాలను ప్రతిబింబించే పార్టీల మధ్య నేరుగా, స్పష్టమైన పోటీగా మారాయి. ఒకటి ప్రాంతీయ ఆధిపత్యం, సంక్షేమ కార్యక్రమాలపై ఆధారపడితే, మరొకటి జాతీయ ఏకీకరణ, గుర్తింపు రాజకీయాలపై దృష్టి పెట్టింది.ఐదేళ్లు గడిచిన తర్వాత కూడా, టిఎంసి ఆధిపత్యం ఎంతకాలం నిలబడుతుందన్నది. 'కొనసాగింపు, అలసట' అనే రెండు అంశాల మధ్య జరుగుతున్న సంక్లిష్ట సమతుల్యతపై ఆధారపడి ఉంది. పార్టీకి ఉన్న ప్రధాన బలం దాని బలమైన సంస్థాగత వ్యవస్థ, అలాగే సంక్షేమ పథకాల ద్వారా ఓటర్ల విశ్వాసాన్ని సంపాదించే సామర్థ్యం. మహిళలు, ఆర్థికంగా బలహీన వర్గాలను లక్ష్యంగా పెట్టుకున్న పథకాలు, స్థిరమైన సామాజిక మద్దతును ఏర్పరచాయి. ఇప్పటివరకు ఈ మద్దతు, ప్రభుత్వ వ్యతిరేక భావన, తీవ్రమైన రాజకీయ ప్రచారాలను కూడా తట్టుకుని నిలిచింది. అంతేకాదు, మమతా బెనర్జీ వ్యక్తిగత ప్రజాదరణ కూడా పార్టీకి కీలక బలం. ఆమె నాయకత్వం పార్టీ కథనాన్ని బలపరచడమే కాకుండా, అంతర్గత విభజనలను తగ్గించడంలో సహాయపడుతోంది.అయితే, అధికారంలో ఎక్కువ కాలం ఉండటం వల్ల అసంతృప్తి సహజంగానే పెరుగుతుంది. అవినీతి ఆరోపణలు, పార్టీలో వర్గపోరాటాలు, స్థానిక స్థాయిలో కార్యకర్తలలో ఉన్న అసహనం-- ఇవన్నీ కొన్ని ప్రాంతాల్లో వ్యతిరేక భావనకు దారితీశాయి. ఇవి తాత్కాలిక సమస్యలుగా కొట్టిపారేయలేనివి. ఈ బలహీనతలను టిఎంసి నాయకత్వం గుర్తించినట్లే కనిపిస్తోంది. అందుకే అభ్యర్థుల ఎంపికలో మార్పులు చేయడం, కొత్త తరాన్ని ముందుకు తీసుకురావడం వంటి చర్యలను చేపడుతోంది. అయితే ఇవి ఎంతవరకు ప్రభుత్వ వ్యతిరేక భావనను తగ్గిస్తాయన్నది కీలక అంశంగా మారనుంది. ఇటీవల జరిగిన ఉపఎన్నికల్లో పార్టీ ప్రదర్శన, దాని స్థిరత్వాన్ని సూచించినప్పటికీ, అత్యంత కీలకమైన అసెంబ్లీ పోటీలో పార్టీ పట్టు కోల్పోయే అవకాశాన్ని ఇవి పూర్తి తొలగించలేవు. బెంగాల్‌లో పార్టీ విస్తరణ ఇప్పటికే రాష్ట్ర రాజకీయ సమీకరణలను మార్చేసింది. అయితే 2021 తర్వాత దాని ప్రస్థానం, పురోగతి కంటే ఎక్కువగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికే పరిమితమైంది. ఉత్తర బెంగాల్ ప్రాంతాల్లో, అలాగే గుర్తింపు రాజకీయాలు, పాలనపై పార్టీ ఇచ్చిన సందేశాలకు స్పందించిన వర్గాల్లో బిజెపికి గట్టి ఓటు బ్యాంక్ ఉంది. అయినప్పటికీ, ఓట్ల వాటాకు, సీట్ల మార్పిడికి మధ్య ఉన్న అంతరం ఒక కీలకమైన అడ్డంకిగా మిగిలిపోయింది. 'ఫస్ట్ -పాస్ట్ -ది- పోస్ట్' విధానం సంస్థాగత బలహీనతలను మరింత స్పష్టంగా బయటపెడుతోంది. ఈ విషయంలో బిజెపి, టిఎంసిలో పాతుకుపోయిన క్షేత్రస్థాయి యంత్రాంగం కంటే వెనుకబడి ఉంది. బిజెపి ఎదుగుదలకు మరో ముఖ్యమైన అడ్డంకి నాయకత్వ సమస్య. జాతీయ స్థాయి నాయకులు పార్టీకి గుర్తింపు, ఉత్సాహం తీసుకువచ్చినా, మమతా బెనర్జీకి సమానంగా రాష్ట్రస్థాయిలో ప్రభావం చూపగల నాయకుడు లేకపోవడం పార్టీకి పెద్దలోటుగా మారింది. బెంగాల్ రాజకీయాల్లో ఎప్పటినుంచో ప్రాంతీయ భావజాలం, వ్యక్తిగత నాయకత్వానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంది. అయితే బిజెపి ప్రధానంగా కేంద్రస్థాయి కథనాలపై ఆధారపడటం వల్ల, అవి స్థానిక స్థాయిలో పూర్తిగా ప్రభావం చూపలేకపోయాయి. ఈ లోటును పూడ్చాలంటే, పార్టీకి కేవలం ఓట్ల శాతం పెరగడమే కాకుండా, మరింత సమర్థవంతమైన సంస్థాగత నిర్మాణం, స్పష్టమైన రాష్ట్రస్థాయి నాయకత్వ వ్యూహం అవసరం. ఇక వామపక్షాల పరిస్థితి చూస్తే, అది చారిత్రక పతనాన్నీ, తాత్కాలిక పట్టుదలనూ ప్రతిబింబిస్తోంది. మూడు దశాబ్దాలపాటు ఏకపక్ష ఆధిపత్యం చూపిన వామపక్షాలు, ఇప్పుడు శాసనసభలో దాదాపు కనిపించని స్థితికి చేరాయి. 2021లో వారి సంప్రదాయ మద్దతుదారులు బిజెపి వైపు మళ్లడం, బిజెపి సిద్ధాంతానికి మద్దతు పలకడం కంటే, టిఎంసిని ఓడించాలనే వ్యూహాత్మక నిర్ణయాన్ని ఎక్కువగా భావించాలి. అయితే ఈ విధమైన వ్యూహాత్మక ఓటింగ్ వల్ల ప్రస్తుతం రాజకీయాలు రెండు పార్టీల మధ్యే కేంద్రీకృతమయ్యే పరిస్థితి మరింత బలపడింది.. చిన్న పోటీల్లో ఓట్ల శాతం క్రమంగా పెరగడం, పడిపోతున్న స్థితి కొంతవరకు స్థిరపడిందని సూచిస్తున్నప్పటికీ, దాని పునరుజ్జీవనానికి ఉన్న నిర్మాణాత్మక అడ్డంకులు మాత్రం చాలా బలంగా ఉన్నాయి. తీవ్రంగా విభజన చెందిన రాజకీయాల్లో, గెలిచే అవకాశాలు లేవని భావించే మూడో పార్టీకి ఓటేయడానికి ప్రజలు సాధారణంగా ముందుకురారు. బలమైన నాయకత్వం లేదా కొత్త రాజకీయ దిశ లేకపోతే, వామపక్షాలు అధికారానికి కాకుండా, కేవలం తమ ప్రాధాన్యాన్ని నిలబెట్టుకోవడానికే పరిమితమయ్యే అవకాశమే ఎక్కువగా కనిపిస్తోంది. రాబోయే ఎన్నికలను మరింత అనిశ్చితంగా మారుస్తోన్న ప్రధాన అంశం స్వల్ప తేడాతో నిర్ణయించబడే నియోజకవర్గాల ప్రాధాన్యం. 2021లో గణనీయమైన సంఖ్యలో స్థానాలు చాలా తక్కువ ఓట్ల తేడాతోనే నిర్ణయించబడ్డాయి. అంటే, ఓటర్ల ప్రాధాన్యతల్లో చిన్న మార్పు వచ్చినా, సీట్ల ఫలితాల్లో అసమానమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఈ పరిస్థితి ఒకవైపు రెండు పార్టీల మధ్య స్థిరమైన పోటీ ఉన్నప్పటికీ, మరోవైపు అనిశ్చితిని కూడా పెంచుతోంది. ప్రాంతాల వారీగా చూస్తే పరిస్థితి మరింత క్లిష్టంగా కనిపిస్తోంది. బెంగాల్ ఉత్తర జిల్లాల్లో బిజెపికి బలమైన స్థానం ఏర్పడగా, దక్షిణ ప్రాంతాల్లో టిఎంసి తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. ఈ భౌగోళిక విభజనను రెండు పార్టీలూ తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేయనున్నాయి. మరింత లోతుగా చూస్తే, ఈ పోటీ పరిపాలన, సంక్షేమం అనే పరస్పర విరుద్ధమైన కథనాల చుట్టూ తిరిగే అవకాశం ఉంది.

# పేరెంట్స్ కోసం...15 శాతం జీతాలు

## - రేవంత్ సంచలన నిర్ణయం



**హైదరాబాద్-సూర్య వాస్తవం:**

కన్నవారిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యతను మరిచి, వారిని రోడ్డున పడేస్తున్న కొందరు ప్రభుత్వ ఉద్యోగుల తీరుపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక సంచలనం అని చెప్పాలి. పదవి, హోదా ఉన్నా.. కన్నతల్లిదండ్రులకు పట్టెడు అన్నం పెట్టని వారికి ఈ కొత్త చట్టం ఒక గట్టి గుణపాఠం కానుంది. మమకారం కరువైన చోట కనీసం ఆర్థిక భరోసానైనా కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పం వేలాది మంది వృద్ధులకు కొండంత అండగా నిలవబోతోంది. ఈ చట్టం వెనుక ఉన్న నిబంధనలు, అది అమలులోకి వచ్చే తీరుపై లోటుగా విశ్లేషణ చేస్తే.. తల్లిదండ్రుల కోసం జీతంలో కోత తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. సదరు ఉద్యోగి జీతంలో 15 శాతం లేదా గరిష్టంగా ?10,000 వరకు కోత విధించి, ఆ మొత్తాన్ని నేరుగా వారి తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. దీనివల్ల వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకుండా, గౌరవంగా బతికే అవకాశం లభిస్తుంది. కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా, నేరుగా ఆర్థికపరమైన చర్యలు తీసుకోవడం ఇదే మొదటిసారి. ఈ వినూత్న నిర్ణయానికి చట్టబద్ధత కల్పించేందుకు ప్రభుత్వం 'తెలంగాణ ఎంప్లాయీస్ అకౌంటబిలిటీ అండ్ మానిటరింగ్ ఆఫ్ పేరెంటల్ సపోర్ట్' అనే కొత్త చట్టాన్ని తీసుకురాబోతోంది. ఈ బిల్లుపై ఈరోజు జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదం తెలపనున్నారు. అనంతరం ఒకటి రెండు రోజుల్లోనే దీనిని అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టంగా మలిచే అవకాశముంది. ఒకసారి ఈ చట్టం అమల్లోకి వస్తే, తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే విచారణ జరిపి, ఆటోమేటిక్‌గా జీతం నుంచి కోత విధించే ప్రక్రియ ప్రారంభమవుతుంది. నైతిక బాధ్యత చాలా మంది ఉద్యోగులు తమ సొంత ఇల్లు, పిల్లల చదువుల పేరుతో తల్లిదండ్రులను దూరం పెడుతున్నట్లు అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం విధులే కాదు, నైతిక బాధ్యతలు కూడా ఉంటాయని ఈ చట్టం గుర్తు చేస్తోంది. ప్రభుత్వం కేవలం జీతాలు ఇవ్వడమే కాకుండా, ఆ జీతంతో కుటుంబంలోని వృద్ధులకు న్యాయం జరుగుతోందా లేదా అన్నది కూడా పర్యవేక్షించనుంది. ఇది సమాజంలో వృద్ధాశ్రమాలకు వెళ్లే వారి సంఖ్యను గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది. ఈ చట్టం కేవలం శిక్షాత్మక చర్యలకే పరిమితం కాకుండా, సమాజంలో ఒక లోతైన మార్పును తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించబడింది. కేవలం ఆర్థిక పరమైన అంశాలనే కాకుండా, వృద్ధాప్యంలో తల్లిదండ్రులు ఎదుర్కొనే సామాజిక వివక్షను అరికట్టడం కూడా ఈ బిల్లులోని అంతర్లీన ఉద్దేశ్యం. ప్రభుత్వ ఉద్యోగులు సమాజంలో ఒక బాధ్యతాయుతమైన వర్గంగా ఉంటారు కాబట్టి, వారి నుంచే ఈ ప్రక్షాళన మొదలవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ చట్టం అమలులోకి వస్తే, అది కేవలం ఒక నిబంధనగా కాకుండా, ప్రతి ఇంట్లోనూ కన్నవారి పట్ల ఉండాల్సిన కనీస ధర్మాన్ని గుర్తుచేసే ఒక నైతిక భారంగా మారుతుంది. ఈ చట్టానికి సంబంధించిన మరిన్ని కీలక అంశాలు ఇక్కడ ఉన్నాయి: వృద్ధాశ్రమాలకు చెక్ - కుటుంబ వ్యవస్థకు బలం! ప్రస్తుత కాలంలో వృద్ధాశ్రమాల సంఖ్య పెరిగిపోవడానికి ప్రధాన కారణం.. ఆర్థికంగా స్థిరపడిన పిల్లలు తమ తల్లిదండ్రులను భారంగా భావించడమే. ముఖ్యంగా స్థిరమైన ఆదాయం ఉండే ప్రభుత్వ ఉద్యోగులే తమ వారిని దూరం పెట్టడం అత్యంత విచారకరం. ఈ కొత్త చట్టం ద్వారా, తల్లిదండ్రుల పోషణకు అవసరమైన కనీస మొత్తాన్ని వారి జీతం నుంచే నేరుగా అందించడం వల్ల, వృద్ధులు అనాథాశ్రమాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. ఇది మన భారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థను మళ్లీ బలోపేతం చేయడానికి మరియు వృద్ధులకు ఆత్మగౌరవంతో కూడిన జీవితాన్ని ప్రసాదించడానికి ఒక గొప్ప మార్గంగా నిలుస్తుంది. ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగం! ఈ చట్టం అమలులో భాగంగా, కేవలం నిబంధనలు పెట్టడమే కాకుండా, తల్లిదండ్రుల ఫిర్యాదులను స్వీకరించడానికి ప్రభుత్వం ఒక ప్రత్యేక విభాగాన్ని లేదా కమిటీని ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఒకవేళ ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా తన తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఆధారాలతో సహా ఫిర్యాదు అందితే, తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకునేలా నిబంధనలు రూపొందిస్తున్నారు. ఇది ప్రభుత్వ యంత్రాంగంలో ఒక జవాబుదారీతనాన్ని పెంచడమే కాకుండా, తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారికి సింహస్వప్నంలా మారుతుంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ నిర్ణయం ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలవనుంది.

భయంతోనైనా తల్లిదండ్రులను చూసుకోవడం మొదలుపెడితే, క్రమంగా వారి మధ్య ఉన్న దూరం తగ్గే అవకాశం ఉందని సామాజికవేత్తలు భావిస్తున్నారు. కన్నవారి రుణం తీర్చుకోలేకపోయినా, కనీసం వారికి ఆకలి బాధ లేకుండా చూడటం ప్రతి బిడ్డ కనీస ధర్మం. ఈ చట్టం ద్వారా ప్రభుత్వం వృద్ధుల కళ్లలో వెలుగు నింపాలని చూస్తోంది.

# జగన్ ఇమేజ్ డ్యామేజ్





**విజయవాడ -సూర్య వాస్తవం:**

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబంలో చెలరేగిన ఆస్తుల వివాదం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలతో జగన్ సాగిస్తున్న ఈ న్యాయపోరాటం కేవలం ఒక కుటుంబ సమస్యగా కాకుండా, రాజకీయంగా పెను ప్రభావం చూపే అంశంగా మారింది.వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత ఆస్తుల పంపిణీ విషయంలో జగన్, షర్మిల మధ్య విభేదాలు పొడసూపాయి. గతంలో కుదుర్చుకున్న ఒక అవగాహన ఒప్పందం ప్రకారం కొన్ని ఆస్తులను చెల్లికి బదలాయించాల్సి ఉండగా, జగన్ ఆ ప్రక్రియను నిలిపివేయడం వివాదానికి కేంద్రబిందువు అయింది. ఈ క్రమంలో జగన్ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ను ఆశ్రయించడం, షర్మిలకు ఇచ్చిన షేర్లను తిరిగి తీసుకోవాలని కోరడం సంచలనం సృష్టించింది. దీనికి ప్రతిగా తల్లి విజయమ్మ, షర్మిల తరఫున నిలబడి అఫిడవిట్ దాఖలు చేయడం జగన్‌కు వ్యక్తిగతంగా పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

జగన్ రాజకీయ జీవితం మొత్తం "మాట తప్పను.. మడమ తిప్పను" అనే నినాదం చుట్టూ తిరుగుతుంది. అయితే, తండ్రి బతికి ఉన్నప్పుడు చెప్పిన అంశాలను, కుటుంబ ఒప్పం దాలను ధిక్కరించడం వల్ల ఆయన 'విశ్వ సనీయత' ప్రశ్నార్థకమైంది. సొంత తల్లిని, చెల్లిని కోర్టుకు లాగడం అనేది తెలుగు సమాజంలో నైతికంగా ఆమోదయోగ్యం కాని విషయం. సామాన్యులెవరూ దీన్ని అంగీకరించరు. చెల్లి విషయంలో అయినా కాస్త ఆలోచిస్తారేమో కానీ, తల్లిని కూడా జగన్ ఇబ్బంది పెడుతున్నారనే అంశమే ప్రజల్లోకి బాగా వెళ్తోంది. ఇది ఆయన వ్యక్తిగత ఇమేజ్‌ను గణనీయంగా దెబ్బతీస్తోంది. ఈ వివాదం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టం చేకూర్చేలా ఉంది. జగన్ తన పాలనలో 'అక్కా.. చెల్లెమ్మ' అంటూ మహిళలకు ప్రాధాన్యతనిచ్చారు. కానీ సొంత చెల్లికి ఆస్తి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారనే ప్రచారం మహిళా ఓటర్లలో ప్రతికూల భావనను కలిగించే అవకాశం ఉంది. టీడీపీ, జనసేన వంటి పార్టీలు ఈ అంశాన్ని రాజకీయంగా వాడు కుంటున్నాయి. "సొంత తల్లికే న్యాయం చేయలేని వ్యక్తి, రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేస్తాడు?" అనే ప్రశ్నను ప్రజల్లోకి బలంగా తీసుకెళు _న్నాయి. క్షేత్రస్థాయిలో ఉన్న వైసీపీ కార్యకర్తలు ఈ వివాదంపై ప్రజలకు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబం విడిపోవడం వల్ల పార్టీ పట్ల ఉన్న సెంటిమెంట్ పలచబడే ప్రమాదం ఉంది.జగన్ తన ఆస్తులు ఈడీ అటాచ్‌మెంట్‌లో ఉన్నాయని, అందుకే బదలాయింపు సాధ్యం కాదని వాదిస్తున్నారు. కానీ, కుటుంబ సభ్యులు దీనిని కేవలం జగన్ 'మొండితనం'గా భావిస్తున్నారు. ఆస్తుల విలువ కంటే, తన మాటే చెల్లాలనే ఆయన 'ఈగో' వల్లనే ఈ సమస్య ఇంతవరకు వచ్చిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాజకీయ చాణక్యత ప్రదర్శించాల్సిన చోట, జగన్ తన కుటుంబంపై కఠినంగా వ్యవహరించడం వ్యూహాత్మక తప్పిదమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.జగన్ ఈ సమస్యను త్వరగా పరిష్కరి ంచుకోకపోతే, భవిష్యత్తులో రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఆస్తుల వల్ల ఆర్థిక బలం పెరగవచ్చు కానీ, రాజకీయాల్లో అత్యంత విలువైన ప్రజాభిమానం, విశ్వసనీయతను ఆయన కోల్పోయే ప్రమాదం ఉంది. తల్లి విజయమ్మ ప్రత్యక్షంగా షర్మిల వెనుక నిలబడటం జగన్ రాజకీయ ప్రయాణంలో అతిపెద్ద సవాలుగా మిగిలిపోనుంది.

# హరిహర పుత్రునికి పంచామృతాభిషేకాలు

**- ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చిన మణికంఠుడు**



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల పార్నపల్లి రోడ్డు కోటి సమాధి సమీపంలో కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయాస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు సాయి, మధు, గురుస్వామి వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, బిల్వ అర్చన, అష్టోత్ర శతనామావళి, తదితర పూజ కైకర్యాల అనంతరం అయ్యప్ప స్వామి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గురుస్వామి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ స్వామివారి ఆశీస్సులతో కార్తీక మాసం, 365 రోజులలో ప్రతి నిత్యము బుధవార రోజులలో స్వామివారికి విశేష పూజలు ధూప దీప నైవేద్యాలు భక్తుల సహాయ సహకారాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడంగ జరుగుతోందన్నారు. ప్రతి మాసంలో అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రంలో విశేష పూజలు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహ కులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను అయ్యప్ప స్వాములకు భక్తులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# శివాలయంలో నూతన గదుల ప్రారంభం



**వేముల - సూర్య వాస్తవం :** వేముల మండలంలోని గొల్లల గూడూరు గ్రామ శివాల యంలో గజ్జల బాలి రెడ్డి దాతృత్వంతో నిర్మించిన నూతనగదులను బుధవారం వైసీపీ మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి,జడ్పిటిసి కోగటం భయపు రెడ్డిలు బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ భక్తులకు సౌకర్యంగా ఉండేలా నిర్మించిన ఈ గదులు ఆలయానికి ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం భక్తుల సౌకర్యం కోసం గదులు నిర్మించిన దాత గజ్జల బాల్రెడ్డిని నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి, బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్లూరు సుదర్శన్, ఈసీ మహేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రమణారెడ్డి,చంద్ర ఓబులరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, గజ్జల సాంబశివరెడ్డి, రమణారెడ్డి, ఓబులరెడ్డి,వైటి రాఘవరెడ్డి, ఈసీ బాలగంగిరెడ్డి, గజ్జల కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పులివెందుల మున్సిపాలిటీలో 'వాహనాల గేటు గుత్త' బహిరంగ వేలం



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులి వెందుల పురపాలక సంఘానికి సంబంధించి 2026-27 సంవత్సరానికి గాను నిలుపబడిన వాహనాల గేటు గుత్త కోసం ఈ నెల 30న బహిరంగ వేలం నిర్వహించ నున్నట్లు మున్సిపల్ కమిషనర్ పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. మార్చి 30, 2026 (సోమవారం) ఉదయం 11:00 గంటలకు పులివెందుల మున్సిపల్ కార్యాలయం నందు ఆసక్తి గల వారు వేలం రోజు (మార్చి 30) ఉదయం 10:30 గంటలలోపు తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. వేలంలో పాల్గొనే అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయంలో రూ.100 చెల్లించి దరఖాస్తు ఫారాన్ని పొందవలసి ఉంటుందని, ఈ వేలం 01.03.2026 నుండి 31.03.2027 కాలపరిమితికి సంబంధించి నిర్వహించ బడుతుందన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయ పనివేళల్లో (ఉదయం 10:00 నుండి సాయంత్రం 5:00 వరకు) రెవెన్యూ విభాగంలోని ఏ1 సెక్షన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లేదా రెవెన్యూ అధికారిని సంప్రదించాలని కమిషనర్ సూచించారు.

# నేడు మెడికల్ కాలేజీ సందర్శనకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రాక



**పులివెందుల - సూర్య వాస్తవం :** పబ్లిక్ ప్రయివేట్ పార్ట్నర్ షిప్ (పిపిపి) విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నూతన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ, ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెడికల్ కళాశాల సందర్శన కార్యక్రమానికి గురువారం పులివెందుల మెడికల్ కాలేజీ సందర్శనలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పాల్గొనున్నారని సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆయనతోపాటు కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఎన్ తులసి రెడ్డి, వైసిపి నాయకులూ ఎస్ సతీష్ కుమార్ రెడ్డి, సిపిఎం నాయకులు ప్రభాకర్ రెడ్డి, సామాజిక ఉద్యమ నేత రిటైర్డ్ ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య, ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎంవి రమణయ్య, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు కే.నారాయణ, మెడికల్ కాలేజీలో పరిరక్షణ కమిటీ నాయకులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కేఎస్ లక్ష్మణరావు, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, డాక్టర్ కుర్ర వసుంధర, కొరివి వినయ్ కుమార్, అదేవిధంగా విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు పాల్గొననున్నారని తెలియజేశారు.

# పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను వెంటనే ప్రారంభించాలి

**- వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె - సూర్య వాస్తవం :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభించాలని 2026- 27 సంవత్సరంలో అడ్మిషన్స్ ఇవ్వాలని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు, ప్రభుత్వ మెడికల్ కళాశాల పరిరక్షణ కమిటీ సభ్యులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈనెల 25వ తేదీన బుధవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కోటమిప్రభుత్వం పులివెందుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించడం శోచనీయమన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే గత ప్రభుత్వం దాదాపు 100 కోట్లు చేసే 50 ఎకరాల భూమిని ప్రభుత్వ వైద్య కళాశాలకు కేటాయించటమే గాక భవనాల నిర్మాణం కోసం మౌలిక సదుపాయాల కోసం మరో 412 కోట్లు ఖర్చు చేయటం జరిగిందన్నారు. ఆసుపత్రి భవనాలు 100శాతం పూర్తయినాయని, 625 పడకల బోధన ఆసుపత్రి అన్ని విధాల పూర్తయిందని తెలిపారు.

నర్సింగ్ కళాశాల భవనాలు 100శాతం పూర్తయినాయని, మెడికల్ కళాశాల భవనాలు 60 శాతం, క్వార్టర్స్ భవనాలు 60 శాతం పూర్తి అయినాయని వివరించారు. నేషనల్ మెడికల్ కమిషన్ వారు ఢిల్లీ నుండి వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించి 2024-- 25 విద్యా సంవత్సరంలోనే 50 ఎంబిబిఎస్ సీట్లు కేటాయించడం జరిగిందని కానీ దురదృష్టవశాత్తు చంద్రబాబు ప్రభుత్వం భవనాలు పూర్తి కాలేదని, ఫ్యాకల్టీ లేదని సాకుచూపి కేటాయించిన 50 మెడికల్ సీట్లను వద్దని లేఖ రాసి వెనుకకు పంపిందన్నారు. పర్యవసానంగా పులివెందుల ప్రభుత్వ కళాశాల 2024 --25లో 50 ఎంబిబిఎస్ సీట్లును 2025--2026లో 150 ఎంబిబిఎస్ సీట్లను కోల్పోయిందని పేర్కొన్నారు. 2026 27 కు సంబంధించి 150 ఎంబిబిఎస్ సీట్ల కోసం, 24 పీజీ సీట్ల కోసం చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నమే చేయడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఒకవైపు పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలను 100 ఎంబిబిఎస్ సీట్లతో ఈ విద్యా సంవత్సరం నుండి ప్రారంభించాలని నిర్ణయించిన కూటమి ప్రభుత్వం పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను గూర్చి ఏమాత్రం పట్టించుకోకపోవడం అన్యాయమని వారు ధ్వజమెత్తారు. ప్రభుత్వం నేషనల్ మెడికల్ కమిషన్ తో చర్చించి 2026-- 27 విద్యా సంవత్సరంలోనే 100 ఎంబిబిఎస్తో, 24 పీజీ సీట్లతో పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 26వ తేదీన గురువారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ వైద్య కళాశాల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించడం జరుగుతుందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, కాంగ్రెస్ మీడియా రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ కుమార్ రెడ్డి,సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కే.ప్రభాకర్ రెడ్డి ప్రముఖ సామాజిక ఉద్యమ నేత ప్రొఫెసర్ సి రామచంద్రయ్య, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎంవి రమణయ్య, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు కే.నారాయణ,బిసి చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బీసీ రమణ, ప్రభుత్వ మెడికల్ కళాశాల పర్మిషన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆల వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, డాక్టర్ వసుంధర కుర్ర తదితరులు కళాశాలను సందర్శిస్తారని వివరించారు. వీటితోపాటు విద్యార్థి యువజన పౌర సంస్థల నేతలు పాల్గొంటారని తెలిపారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం కాంగ్రెస్ సీనియర్ నేతలు అమర్నాథరెడ్డి ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు, వేమా రాజా, రమణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ వారి అవగాహన సదస్సు విజయవంతం చేయండి




**వేంపల్లె - సూర్య వాస్తవం :** విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీ ఆదివారం నిర్వహించే హిందూ దేవాలయాల స్వయంప్రతిపత్తి ముసాయిదా చట్టంపై అవగాహన సదస్సు కార్యక్రమంలో హిందూ బంధువులందరూ పాల్గొని విజయవంతం చేయాలని విశ్వహిందూ పరిషత్ వేంపల్లె మండల అధ్యక్షులు లోమడ తిరుమలరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వేంపల్లెలో విశ్వహిందూ పరిషత్ మండల కార్యవర్గ సభ్యులు మీడియా సమావేశంలో మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు నందారపు చెన్నకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు వేంపల్లె, వేముల,చక్రాయపేట, మండలంలోని హిందూ బంధువులందరూ ఈ కార్యక్రమానికి తరలివచ్చి విజయ వంతం చేయాలని కోరారు. ఈనెల 29వ తేదీ ఆదివారం కడప జిల్లా కేంద్రం లోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో వెలసిన శ్రీ కోదండరామయ్య స్వామి దేవస్థానంలో ఈ అవగాహన సదస్సు నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా హిందూ దేవాలయాల స్వయంప్రతిపత్తి కోసం నిర్వహించే ఈ మహోద్యమంలో హిందూ బంధువులందరూ భాగస్వాములు కావాలని, అందరూ పాల్గొనాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారిమఠంకు చెందిన పరమపూజ్యులు విరజానంద స్వామీజీ, కడపకు చెందిన పరమపూజ్యులు తురియానంద సరస్వతీ స్వామీజీలు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేంపల్లె మండల విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షులు శంకర్, కార్యదర్శి బాబు, ఉపకార్యదర్శి గంగిరెడ్డి, జిల్లా ఉపకార్యదర్శి విశ్వనాథ్, బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మా తదితరులు పాల్గొన్నారు.


# నూతన గృహప్రవేశ వేడుకల్లో వైసీపీ శ్రేణులు

**లింగాల - సూర్య వాస్తవం :** పులివెందుల నియోజకవర్గం, లింగాల మండలం చిన్న కూడాల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు నాగేంద్ర రెడ్డి నూతన గృహప్రవేశ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పులివెందుల మాజీ మున్సిపల్ ఇంచార్జ్ వైఎస్ మనోహర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల పట్టణ వైకాపా అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పార్లపల్లి కిషోర్ లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన గృహంలోకి ప్రవేశించిన నాగేంద్ర రెడ్డి కుటుంబ సభ్యులకు వైఎస్ మనోహర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకలో వైసీపీ నాయకులు, హాల్ గంగాధర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు బంధుమిత్రుల రాకతో నాగేంద్ర రెడ్డి నివాసం వద్ద సందడి నెలకొంది. ఈ సందర్భంగా విచ్చేసిన అతిథులకు నాగేంద్ర రెడ్డి కుటుంబ సభ్యులు ఘనంగా ఆతిథ్యం ఇచ్చారు.





# లక్ష బియ్యపు గింజలపై శ్రీరామ నామంతో తలంబ్రాలు



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలోని స్థానిక శ్రీనివాస్ నగర్‌లో గల శ్రీ సీతారాముల కల్యాణోత్సవం ప్రత్యేకంగా ఏడాది శ్రీ సీతారాముల కళ్యాణంలో లక్ష బియ్యం గింజల పై శ్రీరామ నామం తలంబ్రాలు బియ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ఆళ్లగడ్డ రాము మాట్లాడుతూ..... బెంగళూరుకి చెందిన కె శైలజ ఎంతో భక్తిశ్రద్ధలతో దాదాపు లక్ష బియ్యం గింజల పై స్వయంగా తను శ్రీ రామనామం రాసి మాకు అందించడం జరిగిందని తెలిపారు. శుక్రవారం నాడు జరగబోయే కళ్యాణం ఉత్సవం లో సీతారాములకి తలంబ్రాలుగా సమర్పించబడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాంప్రసాద్, రామ్మూర్తి, రామచంద్ర, మరియు శ్రీవారి సేవకులు ప్రసాద్ అనిల్ సంతోష్ ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కళ్యాణ రామ నూతన విగ్రహ ప్రతిష్ట





**కడప - సూర్య వాస్తవం:** కాశి నాయన మండలం నాయనపల్లి గ్రామంలో శ్రీ కళ్యాణ రామ నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ పుణ్యకార్యానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి హాజరయ్యారు. గ్రామస్తులు పూర్ణ కుంభంతో సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు మంత్రో చ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజస్తంభంవద్ద కొబ్బరికాయ కొట్టి దేవునికి నమస్కరించారు. ఈ కార్యక్రమం మొత్తం భక్తి పారవశ్యంతో నిండిపోయి, గ్రామం మొత్తం ఒక ఆధ్యాత్మిక క్షేత్రంలా మారింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేయగా, పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆనందభరితంగా ఆశీర్వాదాలు స్వీకరించారు. ఎమ్మెల్సీ గ్రామ పెద్దలు, పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్క రించగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మాట్లాడుతూ, నాయన పల్లె గ్రామంలో సీతారాముల స్వామి దేవాలయ నిర్మాణా నికి సహకరించిన ప్రతి గ్రామస్థుడికి, నాయ కులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ దేవాలయం నిర్మాణం నాయనపల్లి గ్రామం చిరకాల ఆకాంక్ష నెరవేరినట్లు ఆయన తెలిపారు అలాగే బద్వేల్ తెలుగుదేశ పార్టీ మాజీ ఎమ్మెల్యే, పార్టీ ఇన్ఛార్జి విజయమ్మ రితీష్ రితీష్ కుమార్ రెడ్డి పూజలను నిర్వ హించి వారిని శాలువాలతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఆధ్యాత్మిక విశ్వాసాన్ని ప్రతిబిం బించేలా దేవాలయం నిర్మించుకోవడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. గ్రామస్తుల ఐక్యత, భక్తి, నిబద్ధత వల్లే ఈ మహోత్సవం విజయవంతమైందని అన్నారు. ఇలాంటి పుణ్యకార్యాలు సమాజంలో సానుకూ లతను పెంచి, ప్రజల మధ్య ఐక్యతను మరింత బలపరు స్తాయని ఆయన పేర్కొన్నారు. చివరగా సీతారాముల కటాక్షం గ్రామ ప్రజ లందరిపై ఎల్లప్పుడూ ఉండి, వారు ఆయు రారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయనపల్లి గ్రామం పెద్దలు ప్రజలు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు

### ప్లాటినం సర్టిఫైడ్ ఈసీఎంఓ సెంటర్‌గా

# యశోద హాస్పిటల్స్‌కు అరుదైన గౌరవం

**- క్రిటికల్ కేర్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్ రామన్ కోలా**




**ప్రొద్దుటూరు- సూర్య వాస్తవం:** ప్రపంచ స్థాయి ట్రాన్స్ ప్లాంట్ కేర్, ఎయిర్ అంబులెన్స్ సేవలతో భారతదేశంలోని ఏకైక ప్లాటినం సర్టిఫైడ్ ఈసీఎంఓ సెంటర్‌గా హైదరాబాద్ యశోద హాస్పిటల్స్‌కు గౌరవం దక్కిందని క్రిటికల్ కేర్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్ రామన్ కోలా తెలిపారు. బుధవారం స్థానిక కొవ్వూరు గ్రాండ్ లో విలేకరులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యశోద హాస్పిటల్స్ ఈసీఎంఓ ప్రమాణాలకు గ్లోబల్ స్టాండర్డ్స్ కలిగిన ఎక్స్ట్రాకార్పోరియల్ లైఫ్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ద్వారా లైఫ్ సపోర్ట్ ఎక్సలెన్స్ కోసం అత్యున్నత స్థాయి ప్లాటినం అవార్డును అందుకున్నందుకు గర్వంగా ఉన్నట్లు ఆయన అన్నారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు ద్వారా యశోద హాస్పిటల్స్ భారతదేశంలోని ఏకైక ప్లాటినం సర్టిఫైడ్ ఈసీఎంఓ సెంటర్గా నిలిచిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యున్నత స్థాయి ఎక్స్ట్రాకార్పోరియల్ లైఫ్ సపోర్టు అందించే ఉన్నత స్థాయి కేంద్రాలలో ఒకటిగా నిలిచిందన్నారు. ఈఎల్ఎస్ఓ ప్లాటినం గుర్తింపు పేషేంట్ భద్రత, క్లినికల్ ఎక్సలెన్స్ మరియు అత్యున్నత అంతర్జాతీయ ప్రమాణాలకు కట్టుబడి ఉండటంపై మా నిరంతర దృష్టికి నిదర్శనమన్నారు. ప్రముఖ ప్రపంచ కేంద్రాలతో పోల్చదగిన ఫలితాలతో కాలేయం, మూత్రపిండాలు, గుండె, ఊపిరితిత్తులు ఎముక మజ్జ మార్పిడితో సహా సమగ్ర మార్పిడి సేవలు,అవయవ మార్పిడి, పునరుద్ధరణకు వారధిగా ఈసీఎంఓ, ఎండ్-స్టేజ్ కార్డియాక్ లేదా రెస్పిరేటరీ ఫెయిల్యూర్ ఉన్న పేషేంట్లకు ప్రాణాలను రక్షించే మద్దతును అంది స్తుందన్నారు. అత్యంత తీవ్రమైన అనారోగ్యం కలిగిన పేషేంట్లక సకాలంలో, కరుణతో కూడిన మరియు అంతర్జాతీయంగా బెంచ్ మార్క్ చేయబడిన సంరక్షణ లభించేలా చూడటం తమ లక్ష్యమన్నారు. అధునాతన ఆరోగ్య సంరక్షణలో దాని అగ్రామమిగా కొనసాగడాన్ని పునరుద్ఘాటిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హరి కిరణ్ టీమ్ లీడర్, మధుసూదన్ పాల్గొన్నారు.

## రామ్‌చరణ్ త్వరగా కోలుకోవాలి

**- జనసేన నేత దాసరి రవిశంకర్**




**వేంపల్లె - సూర్య వాస్తవం:** అగ్రశ్రేణి యువ కథానాయకుడు రామ్‌చరణ్ తొందరగా కోలుకోవాలని పులివెందుల జనసేన నాయకులు డాక్టర్ దాసరి రవిశంకర్ పేర్కొన్నారు. 'పెద్ది' సినిమా చిత్రీకరణ సందర్భంగా రామ్ చరణ్ స్వల్పంగ గాయ పడినట్లు తెలిపారు. ఆయన త్వరగా పూర్తిగా కోలుకోవాలని గండి వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ రామ్ చరణ్ తన కృషి, క్రమశిక్షణ, అంకితభావంతో తెలుగు సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయనలాంటి ప్రతిభావంతుడైన నటుడు ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండటం అభిమానులందరికీ ఎంతో ముఖ్యమైన విషయం. ఈ సమయంలో ఆయన విశ్రాంతి తీసుకుని త్వరగా కోలుకుని, మళ్లీ అదే ఉత్సాహంతో చిత్రీకరణలో పాల్గొని, మరిన్ని మంచి సినిమాలతో ప్రేక్షకులను అలరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు రవి శంకర్ తెలిపారు.

## మున్సిపల్ స్పెషల్ అధికారిగా గుత్త కేశవ నాయుడు బాధ్యతల స్వీకరణ



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణం గుత్తి పురపాలక సంఘం స్పెషల్ ఆఫీసర్‌గా అనంతపురం రెవెన్యూ డివిజనల్ అధి కారి గుత్తా కేషవనాయుడు బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు మున్సిపల్ ఆఫీసులో బాధ్యతల చేపట్టడమైందని ప్రకటన ద్వారా మున్సిపల్ కమీషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఈ హేమ చంద్రకుమార్, శానిటరీ ఇన్స్ పెక్టర్ మహబూబ్ భాషా, మేనేజర్ రాంబాబు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


## గండి అంజన్న ఆలయానికి భారీ ఆదాయం



**వేంపల్లె - సూర్య వాస్తవం:** గండి క్షేత్రంలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో స్వామివారి హుండీల లెక్కింపు కార్యక్రమం డిప్యూటీ కమిషనర్ పట్టం గురు ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టం గురుప్రసాద్ మాట్లాడుతూ ఆలయంలో 122 రోజులు గాను స్వామివారి హుండీలు లెక్కించగా రూ.30, 44, 397 నగదు, 150 గ్రాముల వెండి వస్తువులు, అన్నదానం హుండీ ద్వారా రూ.43,221 భక్తులు సమర్పించారని తెలిపారు.

## వారాంతపు సంతకు వేలం పాట

**- పంచాయతీ కార్యదర్శి ఏమిరెడ్డి నాగభూషణం రెడ్డి**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** 2025--2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించబడే వారాంతపు సంతకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఏమిరెడ్డి నాగభూషణం రెడ్డి తెలిపారు. ఈ వేలం పాట ఈ నెల 28 వ తేదీన శనివారం ఉదయం 10 గంటల కు గ్రామపంచాయతీ కార్యాలయం లోని సమావేశం హాల్లో నిర్వహించబడునని తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 45 లక్షల డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి)ను గ్రామపంచాయతీ కార్యదర్శి పేరిట తీసి, వేలం తేదీకి రెండు రోజుల ముందుగానే కార్యాలయంలో సమర్పించాలన్నారు. అదేవిధంగా, గ్రామపంచాయతీ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, గుత్తేదారు స్వయంగా మార్కెట్ సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని పంచాయతీ తీర్మానం తెలిపినట్లు పంచాయతీ కార్యదర్శి ఏమిరెడ్డి నాగభూషణం రెడ్డి తెలిపారు.



## ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్ధరణ

**- అనంతపురం జిల్లా ప్రజలకు శుభవార్త తెలిపిన మంత్రి**

**ఉరవకొండ - సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా ముద్దుబిడ్డ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ జిల్లా ప్రజలకు గొప్ప శుభవార్త అందిందని తెలిపారు. ఆర్డీటీ (రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్)కి ఎఫ్.సి.ఆర్.ఏ పునరుద్ధరణ జరిగిందని కేంద్రం స్పష్టం చేసిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌ల ప్రత్యేక చొరవతో ఈ పునరుద్ధరణ జరిగిందని, దీంతో జిల్లాలో ఆర్డీటీ సేవలు యధాతథంగా కొనసాగుతాయని మంత్రి కేశవ స్పష్టం చేశారు జిల్లా ప్రజలు మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.

## అరటి రైతులను ఆదుకోవాలి

**- సీపీఎం ఇన్‌చార్జి మనోహర్ డిమాండ్**



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల ప్రాంతంలో అరటి రైతులకు గిటుబాటులేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, అరటి రైతన్నలను తక్షణమే ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పులివెందుల ఇన్చార్జి నాయకులు మనోహర్ పులివెందుల సీపీఎం నాయకులు గఫూర్లు ఒక సంయుక్త ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా రైతు అరటి సాగు పులివెందుల ప్రాంతంలో ఎక్కువ పండిస్తారని తెలిపారు. అదే తరుణంలో జిల్లా అంతా కూడా రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో అరటి రైతన్నలకు కనీస గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదే తరుణంలో ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. రైతాంగం లేకపోతే ఈ దేశ పురోగ వృద్ధి లేదని తెలిపారు .మన శరీరంలో వెన్నముక ఎలాగో దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో రైతున్నలు అంతే కీలకమన్నారు. అలాంటి పరిస్థితుల్లో అరటి రైతాంగాన్ని ఆదుకోవాల్సినటువంటి అవసరం ఉంద న్నారు. నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రభుత్వం రైతాంగానికి న్యాయం చేయాలని కోరారు.

## గరికపాటి పద్మశ్రీని రద్దు చేయండి : బీటీఏ




**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** మధ్యాహ్న భోజన పథకంపై గరికపాటి వ్యాఖ్యలు సరికాదని, గరికపాటి చెప్పే ప్రవచనాలతో పేదల కడుపులు నిండవని పిల్లల్లో రక్తహీనత పౌష్టికాహారం లోపం తగ్గదని మద్యాహ్న భోజన పథకం పై కనీస అవగాహన లేకుండా వ్యంగంగా వెలికిగా మాట్లాడిన గరికపాటికి ఇచ్చిన పద్మశ్రీ పురస్కారాన్ని రద్దు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పల్లం రామచంద్ర అన్నారు. బుధవారం రాయచోటి కొత్త పేటలోని బీటీఏ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ పేదలపట్ల గరికపాటి ఆలోచనలు మానవీయతను పరిహసించే విధంగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బడు లలో దాదాపు 39 లక్షల మంది చదువుతున్నారని వారిలో 25 లక్షల మంది పైగా బడి పిల్లలు పౌష్టికారలోపం, తక్కువ బరువు, ఎదుగుదల లోపంతో, 60 శాతం పైగా పిల్లలు రక్త హీనతతో బాధపడుతున్నారని నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే చెబుతోందని, ఈ లోపాలను సరి చేయడం కోసమే ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా రాగి జావా, చిక్కి, ఉడికించిన గుడ్డు ఫోర్టిఫైడ్ రైస్ తో కూడిన భోజనాన్ని,విటమిన్స్ మినరల్స్ కోసం వివిధ రకాల కూరగాయలతో వండిన ఆహారాన్ని మెనూ ప్రకారం అందిస్తోందని సరైన అవగాహన లేకుండా మధ్యాహ్నం భోజనం పథకం పై అసందర్భ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గ్రామీణ భారతదేశంలో పిల్లలు ఉదయం పూట ఖాళీ కడుపుతో బడికి వస్తున్నారని ఆ విషయం గరికపాటి తెలుసుకోవాలన్నారు. తల్లిదండ్రుల పేదరికం వ్యవసాయ పనులలో తీరిక లేకుండా ఉండడం కారణంగా పిల్లలకు సమయానికి సరైన భోజనం అందడం లేదని ఆ లోపాన్ని సరి చేయడానికే మధ్యాహ్నం భోజన పథకాన్ని పాఠశా లల్లో ప్రవేశపెట్టారన్నారు. మధ్యాహ్న భోజన పథకంతో పాఠశాలల్లో పిల్లల నమోదు శాతం పెరిగిందని డ్రాపవుట్ రేటు కూడా తగ్గిందని వారు గుర్తు చేశారు. తిండి కలిగితె కండకలదోయ్, కండకలవాడేను మనిషోయ్ ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్ అన్న గురజాడ మాటల్ని గరికపాటి మరిచారన్నారు. పేదల విద్య, అభివృద్ధి కోసం సరైన సలహాలను ఇవ్వాలని పేదల కడుపుకొట్టే ఇలాంటి చౌకబారు వ్యాఖ్యల్ని మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బీటీఏ జిల్లా నాయకులు మదన్ మోహన్ నాయక్, ఆమూరి ప్రసాద్ పాల్గొన్నారు.

# శతాబ్దం దాటిన స్ఫూర్తి చుక్కా రామయ్య

- ప్రతి ఇంటికి ఐఐటీ కలలను సాకారం చేసిన గురువు
- డా. ముచ్చుకోట సురేష్ బాబు



**అనంతపురం– సూర్య వాస్తవం :** స్వాతంత్ర్య సమరయోధుడు, దూరదృష్టి గల ఉపాధ్యాయుడు, ప్రఖ్యాత విద్యావేత్త అయిన చుక్కా రామయ్య, "ఐఐటీ రామయ్య"గా ప్రసిద్ధి చెందారు. దేశంలోనే అత్యంత కఠినమైన ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష అయిన ఐఐటీ–జేఈఈను అన్ని వర్గాల విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చిన మహనీయుడు. 1925 నవంబర్ 20న తెలంగాణలోని వరంగల్ జిల్లా గూడూరు గ్రామంలో జన్మించిన రామయ్య, ఉన్నత విద్య కోసం ఉస్మానియా యూనివర్సిటీ లో చేరారు. ఆయన విద్యార్థి దశలోనే స్వాతంత్ర్యోద్యమం ప్రభావం చూపి, సామాజిక అసమానతలు, ఫ్యూడలిజం వ్యతిరేక పోరాటాలలో పాల్గొన్నారు. ఈ పోరాటాల్లో పాల్గొన్నందుకు ఆయన ఔరంగాబాద్ సెంట్రల్ జైలులో కూడా శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్య సమరయోధుడి నుంచి గురువుగా లెటర్స్ ఫ్రమ్ ఎ ఫాదర్ టు హిజ్ డాటర్ అనేది జవహర్‌లాల్ నెహ్రూ తన కూతురు ఇందిరా నెహ్రూకి రాసిన ఉత్తరాల సమాహారం, ది డిస్కవరీ ఆఫ్ ఇండియా వంటి పుస్తకాల ప్రభావంతో విద్య యొక్క శక్తిని ఆయన లోతుగా గ్రహించారు. ఉపాధ్యాయ వృత్తినే అత్యున్నత సేవగా భావించి గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. అనంతరం నాగార్జునసాగర్‌లోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ పాఠశాలలో సేవలందించి పదవీ విరమణ పొందారు. అయితే, పదవీ విరమణ తర్వాతే ఆయన జీవితంలో అత్యంత ప్రభావవంతమైన అధ్యాయం ప్రారంభమైంది.

**విద్యలో ఒక విప్లవానికి నాంది**

1985లో కొంతమంది విద్యార్థుల అభ్యర్థనతో హైదరాబాద్‌లోని నల్లకుంటలో రామయ్య ఐఐటీ స్టడీ సర్కిల్‌ను స్థాపించారు. చిన్న స్థాయిలో ప్రారంభమైన ఈ సంస్థ, క్రమంగా దేశంలోనే ప్రముఖ ఐఐటీ కోచింగ్ కేంద్రంగా ఎదిగింది. ఈ సంస్థ ప్రత్యేకత ఉదయం 4 గంటలకే తరగతులు ప్రారంభించడం. విద్యార్థుల స్కూల్ సమయాలను దృష్టిలో ఉంచుకుని ఈ విధానం అమలు చేశారు. ప్రతి ఏడాది ఏప్రిల్‌లో ప్రవేశాలు ప్రారంభమై, కఠినమైన ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. భావనాత్మక విద్యకు ప్రాధాన్యంరామయ్య బోధనా విధానం కేవలం సూత్రాల జ్ఞాపకశక్తిపై ఆధారపడేది కాదు. భావనాత్మక అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచన, సంభాషణాత్మక బోధనకు ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. ఐఐటీ ప్రశ్నలు జ్ఞాపకశక్తిని కాదు, ఆలోచనా సామర్థ్యాన్ని పరీక్షిస్తాయని ఆయన నమ్మకం. విద్యార్థులే తనకు గురువులని భావించిన ఆయన, వారి కొత్త ఆలోచనలను ప్రోత్సహించారు. ఆయన మార్గదర్శకత్వంలో వేలాది మంది విద్యార్థులు ఐఐటీ ప్రవేశ పరీక్షలో విజయాలు సాధించారు. ఫలితాలకు మించిన వారసత్వం రామయ్య ఐఐటీ స్టడీ సర్కిల్ హైదరాబాద్‌లో ఐఐటీ విజయం అనే పదానికి ప్రతీకగా నిలిచింది. ఆయన పదహారుకి పైగా తెలుగు విద్యా గ్రంథాలను రచించారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి కూడా ఆయన బలమైన మద్దతుదారుడిగా నిలిచారు. బోధన నుండి విరమణ పొందిన తరువాత కూడా చుక్కా రామయ్య విద్యా రంగంపై తన అభిప్రా యాలను వ్యక్తం చేస్తూ, సృజనాత్మకతను పెంపొందిం చాల్సిన అవసరాన్ని ఎత్తిచూపుతున్నారు. ప్రస్తుతం 101 సంవత్సరాల వయస్సులో ఆయన పడకగదికే పరిమిత మైనా, ఆలోచనా శక్తి మాత్రం తగ్గలేదు. రోజూ వార్తలు, భక్తి కార్యక్రమాలు వీక్షిస్తూ, ప్రస్తుత విద్యా విధానం, పాఠ్యాంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటున్నారు. చుక్కా రామయ్య జీవిత ప్రయాణం విద్య ద్వారా సమాజాన్ని మార్చగల శక్తికి ఒక శాశ్వత సాక్ష్యంగా నిలిచింది. బుధవారం చుక్కా రామయ్య స్వగృహంలో టీస్పార్క్ సీఈఓ షేక్ బాబా, చీఫ్ ఎడిటర్ డా.ముచ్చుకోట సురేష్ బాబు పరామర్శించారు.

## పండుగ వాతావరణంలా గ్లోబల్ పబ్లిక్ స్కూల్

# రెండవ వార్షికోత్సవ వేడుకలు

- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** మండల పరిధిలోని గ్లోబల్ పబ్లిక్‌స్కూల్‌లో ఆనందోత్సవ్ పేరిట జరిగిన పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాలు పాఠశాల కరస్పాండెంట్ దాక్షాయని ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణమంతా రంగవల్లికలు, జెండాలు కట్టడంతో పాఠశాలను ప్రత్యే కంగా అలంకరించడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి లక్కిరెడ్డిపల్లి జూనియర్ సివిల్ కోర్టు జడ్జ్ సి. హెచ్. భరత్ కమల్, సీఐ కృష్ణం రాజు నాయక్, ఎస్సై గోల్కొండ శోభ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జడ్జి భరత్ కమల్ జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతు చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించుకోవాలని, అన్ని రంగాలలో రాణించాలని, విద్యార్థి దశ నుండి సామాజిక స్పృహ లక్ష్యాలను అలవర్చుకోవాలని, ఇతరులకు సహాయపడే గుణాన్ని పెంపొందించు కోవాలని తెలిపారు. విద్యార్థులు ఇష్టపడి కష్టపడి చదివినప్పుడే భవిష్యత్తు బంగారు భవిష్యత్తు అవుతుందని తెలిపారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ దాక్షా యని మాట్లాడుతూ పాఠశాల ప్రారంభించిన రెండో ఏడాదే ఆశించిన స్థాయి కంటే ఎక్కువ అడ్మిషన్లు రావటం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇది తమ విద్యా సంస్థపై తల్లిదండ్రులకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని, వచ్చే ఏడాది విద్యార్థులకు మరింత మెరుగైన వసతులను కల్పిస్తామని, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం మరువలేనిదని అన్నారు. అనంతరం చదువులో మంచి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలను ముఖ్య అతిథులు అందజేశారు.





విద్యార్థినీ విద్యార్థులు దేశభక్తి పాటలకు ప్రత్యేకంగా డ్రస్సులతో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చాలా చక్కగా వీక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు

# వేసవిలో వడదెబ్బపై అప్రమత్తం ఉండాలి

- డాక్టర్ షరీఫ్



**కణేకల్ – సూర్య వాస్తవం:** వేసవికాలంలో పెరుగుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని కణేకల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ షరీఫ్ సూచించారు. బుధవారం ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయట ఎక్కువసేపు గడపడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి వడదెబ్బ వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చని హెచ్చరించారు. వడదెబ్బ లక్షణాలు తలనొప్పి, తల తిరగడం, అధిక దాహం, వాంతులు, అలసట, బలహీనత, శరీర ఉష్ణోగ్రత పెరగడం వంటి సమస్యలు కనిపిస్తాయని తెలిపారు. ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరిస్తూ రోజంతా తగినంత నీరు తాగాలని, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ లేదా రుమాలు వినియోగించాలని, తేలికపాటి కాటన్ దుస్తులు ధరించాలని చెప్పారు. మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి ద్రవాలు తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువసేపు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి, చల్లని నీరు లేదా ఓఆర్ఎస్ ఇవ్వాలని, శరీరాన్ని తడి గుడ్డతో చల్లబరచాలని సూచించారు. పరిస్థితి తీవ్రమైతే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా ఏరియా ఆసుపత్రికి తరలించాలని అన్నారు. అదేవిధంగా, వేసవికాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులపై కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొ న్నారు. ఈ మేరకు వైద్య సిబ్బందికి ఇప్పటికే తగిన సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు భారతి, అబ్దుల్ సలాం, నిరీష, జయశ్రీ, హనీఫ్, హెడ్ నర్స్ పద్మావతి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పోలీసులతో దురుసు ప్రవర్తన..

# రిమాండ్‌కు తరలింపు

- రౌడీషీట్ నమోదు - ఒకటవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు



**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించి హెడ్ కానిస్టేబుల్ ను గాయపరిచిన వ్యక్తికి 14 రోజుల రిమాండ్, రౌడీషీట్ ఓపెన్ చేస్తూ కోర్టు ఆదేశాల మేరకు జిల్లా జైలుకు తరలించారు అనంతపురం ఒకటవ పట్టణ పోలీసులు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించే వారికి ఇదొక గుణపాఠం అని తెలిపారు. అసలు వివరాల్లోకి వెళితే.....అనంతపురం ట్రాఫిక్ ఎస్సై రామాంజులరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ హనుమాన్ సహా పోలీసులు "ఆపరేషన్ నైట్ సేఫ్టీ" కార్యక్రమంలో భాగంగా నిన్న రాత్రి 10 గంటల సమయంలో జిల్లా కేంద్రంలోని డ్రంక్ ఉ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో స్థానిక రాణినగర్‌కు చెందిన షేక్ టోపీ వలీ యాక్టివా స్కూటీపై అటుగా రాసాగాడు. శ్రీకంఠం సర్కిల్ లో విధుల్లో ఉన్న పోలీసులు టోపీ వలీను ఆపారు. బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్ష చేసేందుకు సిద్ధమైన పోలీసులకు సహకరించకుండా దురుసుగా ప్రవర్తించాడు. బూతులు తిట్టసాగాడు....అంతటితో ఆగకుండా హెడ్ కానిస్టేబుల్ హనుమాన్‌ను తోసేసి కిందకు పడి రక్తగాయాలయ్యేలా దురుసుగా వ్యవహరించి యాక్టివా వాహనం ద్వారా పరారయ్యాడు. దీంతో రక్తగాయాలయిన హనుమాన్‌ను వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసికెళ్లారు. ట్రాఫిక్ ఎస్సై రామాంజులరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనంతపురం ఒన్ టౌన్ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేసి బుధవారం నాడు షేక్ టోపీ వలీని అరెస్టు చేసి అనంతపురం పి.జె.ఎఫ్.సి.ఎం కోర్టు ముందు హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధిస్తూ కోర్టు వారు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇతనిని జిల్లా జైలుకు తరలించామని అనంతపురం ఒన్ టౌన్ సి.ఐ వెంకటేశ్వర్లు తెలిపారు... ఇతనిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తున్నామన్నారు.

# జిల్లా వ్యాప్తంగా శక్తి బృందాల అవగాహన కార్యక్రమాలు





**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు.. జిల్లా వ్యాప్తంగా శక్తి బృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని శక్తి టీమ్స్ ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాల విద్యార్థులతో పాటు ప్రజా సమూహ ప్రదేశాలలో అవగాహన చేశారు. పోక్సో చట్టం మరియు శిక్షలు, పని ప్రదేశాలలో మహిళలపై జరిగే లైంగిక వేధింపులు, బాల్యవివాహాల దుష్పరిణామాలు పోక్సో చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వేధించడం, వివాహం చేసుకుంటానని నమ్మించి లోబరుచుకోవడం వంటి నేరాలకు పాల్పడిన వారిపై గరిష్ఠంగా 20 సంవత్సరాల జైలు శిక్ష విధించబడుతుందని ప్రజలకు అవేర్నెస్ ప్రోగ్రాం ద్వారా తెలియజేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు పోలీస్ సేవలను వినియోగించుకునేందుకు డయల్ 100 / 112, ఉమెన్ హెల్ప్‌లైన్ నెంబర్ : 181, చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ : 1098 శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసి వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## అనుమానస్పద వ్యక్తుల కదలికలపై

# ఎస్ఐ శివప్రసాద్ విచారణ

**బ్రహ్మంగారి మఠం – సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం మండల టౌన్ పరిధిలోని తెలుగుగంగ కాలనీ సమీపంలో కొందరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారని స్థానిక ప్రజలు సమాచారం ఇవ్వగా ఎస్ఐ శివప్రసాద్ శివప్రసాద్ మరియు వారి సిబ్బంది మరియు బ్రహ్మంగారి మఠం మండల తెలుగు దేశం పార్టీ నాయకులు యస్ ఆర్ శ్రీనివాసులు రెడ్డి కలిసి ఆ గ్రామస్తులను విచారించి రాత్రి వేళలో పోలీస్ నిఘా ఏర్పాటు చేస్తామని మీకు ఏదైనా అవసరం ఉంటే ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని సబ్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ గ్రామస్తులకు తెలిపారు.



# హీరో రామ్‌చరణ్‌కు గాయం

# 'పెద్ది' షూటింగ్ వాయిదా ..!



**హైదరాబాద్ :** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా ... బుచ్చిబాబు సాన దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న 'పెద్ది' చిత్ర షూటింగ్‌లో రామ్ చరణ్ కు గాయమైందనే వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని ఒక భారీ సెట్‌లో జరుగుతోంది. చిత్రీకరణ సమయంలో రామ్ చరణ్ కంటి సమీపంలో చిన్న గాయమైనట్లు సమాచారం. అయితే, ఇది పెద్ద ప్రమాదం ఏమీ కాదని, కేవలం చిన్న దెబ్బేనని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. వైద్యుల సూచన మేరకు చరణ్ కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

కొన్నిరోజులు చిత్రీకరణ స్టాప్ ...
చరణ్ కు గాయం కావడంతో 'పెద్ది' షూటింగ్ కు తాత్కాలికంగా విరామం ప్రకటించారు. కొన్ని రోజులపాటు చిత్రీకరణను నిలిపివేసి, చరణ్ కోలుకున్న తర్వాత మళ్లీ షూటింగ్‌ను ప్రారంభించనున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30న విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. చిన్న విరామం వల్ల విడుదల తేదీపై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చని భావిస్తున్నారు

**రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా సినిమా టీజర్ ...**

ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఇందులో ఉన్న భారీ స్టార్ కాస్ట్, టెక్నీషియన్స్. జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, మృణాల్ ఠాకూర్ ఒక ప్రత్యేక గీతంలో అలరించనున్నారు. శివరాజ్‌కుమార్, జగపతిబాబు వంటి హేమాహేమీలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అద్భుతమైన స్వరాలు సమకూరుస్తున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసేందుకు చిత్రబఅందం ప్లాన్ చేస్తోంది. చరణ్ త్వరగా కోలుకోవాలని మెగా అభిమానులు కోరుతూ పోస్టులు పెడుతున్నారు. దీనిపై చిత్ర యూనిట్ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

# అందమైన చందమామలా 'రాకాస'



జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక కొణిదెల పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' మూవీని నిర్మించారు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. తాజాగా ఈ చిత్ర విశేషాల్ని మానస శర్మ ముచ్చటించారు. 'శ్రీకాకుళం జిల్లా నుండి వచ్చిన నేను మొదటగా యూట్యూబ్‌లో 'మ్యాడ్ హౌస్' చేశాను. తరువాత 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి క్రియేటర్, రైటర్‌గా పనిచేశాను.

'బెంచ్ లైఫ్' సిరీస్‌ని చేశాను. ఇది నాలుగో ప్రాజెక్ట్. ఫాంటసీ, అడ్వెంచర్‌లతో తీసిన 'రాకాస' చాలా కొత్తగా ఉండబోతుంది. కామెడీని ప్రధాన అంశంగా, కొద్దిగా హారర్ ఎలిమెంట్స్‌తో ఈ మూవీని తీశాం. ఈ కథని ముందుగా నెట్ ఫ్లిక్స్‌లో సిరీస్ కోసం చెప్పాను. ఆ టైంలోనే ఈ కథను సంగీత్ విన్నారు. ఆయనకి కథ చాలా నచ్చింది. ఈ కథని పదిహేను నిమిషాలు నెరేట్ చేసిన తరువాత నిహారిక ఓకే చెప్పారు. నయన్ సారిక మంచి నటి.

ఆమె పాత్రని ప్రేక్షకులంతా ఇష్టపడతారు. 'రాకాస' థియేట్రికల్‌గా ఎక్స్‌పీరియెన్స్ చేయాల్సిన చిత్రం. కథ పూర్తిగా ఫిక్షన్. అన్ని పాత్రలు అందరినీ ఆకట్టుకుంటాయి. ఓ అందమైన చందమామ కథలా ఉంటుంది. సెకండాఫ్‌లో ఎక్కువగా వీఎఫ్‌ఎక్స్ ఉంటుంది.

అందుకే ముందుగా సెకండాఫ్ షూట్ చేశాం. ఒక పక్క వీఎఫ్‌ఎక్స్ వర్క్ జరుగుతూ ఉంటే.. ఫస్ట్ హాఫ్‌ని షూట్ చేశాం. అలా మాకు టైం కలిసి వచ్చింది. అనుదీప్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఏ ప్రాజెక్ట్ చేసినా అందులో ఎంటర్టైన్మెంట్ ఉండేలా చూసుకుంటాను. 'రాకాస' తరువాత వాటి గురించి చెబుతాను' అన్నారు.



## ఆయిల్ అండ్ గ్యాస్ సంక్షోభం మధ్య

# ఐపీఎల్ 2026 నడుస్తుందా?



ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ ప్రారంభానికి మరికొద్ది గంటల సమయం మాత్రమే మిగిలి ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ లీగ్‌గా గుర్తింపు పొందిన ఈ టోర్నమెంట్ ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా కోట్లాది ప్రేక్షకులను ఒకే వేదికపైకి తీసుకురానుంది. అయితే ఈసారి పరిస్థితులు మాత్రం గత సీజన్లతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పశ్చిమ ఆసియా ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్ వర్సెస్ అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణం రోజురోజుకీ తీవ్రతరం అవుతోంది. ఈ ప్రభావం గ్లోబల్ ఎయిర్ ట్రావెల్‌పై పడటంతో పాటు ముఖ్యంగా దుబాయ్, అబుదాబి వంటి అంతర్జాతీయ విమాన కేంద్రాల్లో ప్రయాణాలపై పరిమితులు విధించబడుతున్నాయి. ఈ ప్రాంతాలు అంతర్జాతీయ క్రికెట్ ఆటగాళ్ల రాకపోకలకు కీలకమైన మార్గాలు కావడంతో ఐపీఎల్ నిర్వహణపై కూడా పరోక్ష ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఇక మరోవైపు ఆయిల్ , గ్యాస్ సంక్షోభం ప్రజల దైనందిన జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం, ఎల్పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడటం వంటి సమస్యలు సామాన్య ప్రజల ప్రధాన చర్చాంశాలుగా మారాయి. ఇలాంటి సమయంలో వినోదం, క్రీడలపై ప్రజల దృష్టి కొంత మేర తగ్గే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉంటే ఐపీఎల్‌కు సమాంతరంగా పాకిస్తాన్ ప్రీమియర్ లీగ్ (పీఎస్ఎల్) కూడా నిర్వహించబడుతోంది. అక్కడి క్రికెట్ బోర్డు ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని స్టేడియాల్లో ప్రేక్షకులను అనుమతించకుండా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఈ పరిణామం ఐపీఎల్ నిర్వాహకులకు కూడా ఆలోచన కలిగిస్తోంది. పరిస్థితులు మరింత విషమిస్తే ఐపీఎల్‌లో కూడా ఇలాంటి పరిమితులు అమలు చేసే అవకాశాలు లేకపోలేదు. ఇటీవలే టి20 ప్రపంచ కప్ ముగియడంతో ప్రేక్షకులు కొంతవరకు క్రికెట్ అలసటను కూడా అనుభవిస్తున్నారు. మూడు వారాల వ్యవధిలోనే మరో పెద్ద టోర్నమెంట్ ప్రారంభమవుతుండటంతో ప్రేక్షకుల స్పందన ఎలా ఉంటుందో అనేది ఆసక్తికరంగా మారింది. అయితే అన్ని ప్రతికూల పరిస్థితుల మధ్య ఐపీఎల్ ప్రజలకు ఒక వినోద విరామంగా మారుతుందని చెప్పవచ్చు. రోజువారీ ఒత్తిడులను మరిచిపోయి కొన్ని గంటల పాటు క్రికెట్ ఆస్వాదించే అవకాశాన్ని ఇది కల్పిస్తుంది. ముఖ్యంగా యువత, క్రీడాభిమానులకు ఇది ఒక పెద్ద పండుగలాంటిదే. మొత్తానికి ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి సిద్ధంగా ఉన్నప్పటికీ అంతర్జాతీయ రాజకీయాలు, ఇంధన సంక్షోభం, ప్రజల ఆర్థిక పరిస్థితులు వంటి అంశాలు ఈ సీజన్‌పై ఎంతవరకు ప్రభావం చూపుతాయో చూడాలి. అన్ని కళ్లూ ఇప్పుడు ఈ మెగా టోర్నమెంట్ ప్రారంభంపై నిలిచాయి.

# దీపం ఉండగానే డీల్...
# వేల కోట్లకు ఆర్సీబీ విక్రయం!



ఐపీఎల్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన జట్లలో ఒకటైన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) భారీ డీల్‌తో యజమాన్యం మారినట్లు సమాచారం. "దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి" అన్న సామెతను నిజం చేస్తూ ఆర్సీబీ మాతృ సంస్థ యునైటెడ్ స్పిరిట్స్ సరైన సమయాన్ని ఎంచుకుని జట్టును విక్రయించింది. జాతీయ మీడియాలో వెలువడుతున్న కథనాల ప్రకారం.. ఈ డీల్ విలువ సుమారు 1.78 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ.16,706 కోట్లు)గా అంచనా వేయ బడుతోంది. ఇప్పటివరకు ఐపీఎల్ చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్లు అత్యంత విలువైనవిగా గుర్తింపు పొందాయి. అయితే తాజాగా ఒక్క ట్రోఫీతోనే ఆర్సీబీ కూడా వాటిని మించి విలువను సంతరించుకుంది. దీనికి ప్రధాన కారణం జట్టు యొక్క అపారమైన అభిమాన వర్గం, సోషల్ మీడియాలో ఉన్న విపరీతమైన క్రేజ్.. అలాగే బ్రాండ్ బిల్డింగ్‌లో యాజమాన్యం అనుసరించిన ప్రత్యేక వ్యూహాలు. ప్రతి ఏడాది "అన్‌బాక్స్" పేరుతో నిర్వహించే కార్యక్రమం ద్వారా అభిమానులతో నేరుగా అనుసంధానం ఏర్పరచడం.. కార్పొరేట్ కంపెనీలతో పెద్ద ఎత్తున ఒప్పందాలు కుదుర్చుకోవడం వంటి చర్యలు జట్టును కేవలం క్రికెట్ టీమ్‌గా కాకుండా ఒక ఎంటర్‌టైన్‌మెంట్ బ్రాండ్‌గా మలిచాయి. ఫ్రాంచైజీల్లో మొదలైన వణుకు! ఆర్సీబీ మేనేజ్‌మెంట్ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయాలు జట్టు మార్కెట్ విలువను గణనీయంగా పెంచాయి. ముఖ్యంగా ఇటీవల ఐపీఎల్ ట్రోఫీ గెలవడం జట్టుకు మరింత గౌరవం, గుర్తింపు తీసుకొచ్చింది. ఈ నేపథ్యాన్ని ఉపయోగించుకుని యునైటెడ్ స్పిరిట్స్ సంస్థ జట్టును విక్రయించేందుకు ముందుకొచ్చింది. ఈ కన్సార్షియంలో బిర్లా గ్రూప్‌తో పాటు అమెరికాకు చెందిన ప్రముఖ ఇన్వెస్టర్లు డేవిడ్ బ్లిట్జర్, బ్లాక్‌స్టోన్ వంటి సంస్థలు భాగస్వాములుగా ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ కూడా ఈ ఒప్పందంలో భాగస్వామిగా ఉన్నట్లు వార్తలు చెబుతున్నాయి. దేశంలో ప్రీమియం మద్యం ఉత్పత్తులు తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేసే ఈ సంస్థ, తన ప్రధాన వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు ఈ డీల్ ద్వారా భారీ నిధులను సమీక రించినట్టు అంచనా. ఇక ఐపీఎల్ చరిత్రలో మీడియా సంస్థలు జట్టు యాజమాన్యంలో భాగస్వామ్యం కావడం ఇది రెండోసారి. గతంలో డెక్కన్ క్రానికల్ సంస్థ దక్కన్ చార్జర్స్ జట్టును కొనుగోలు చేసింది. ఆ జట్టు తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్‌గా మారిన విషయం తెలిసిందే. మొత్తంగా చూస్తే సరైన సమయంలో తీసుకున్న నిర్ణయం ద్వారా యునైటెడ్ స్పిరిట్స్ సంస్థ వేల కోట్ల లాభాన్ని ఆర్జించడమే కాకుండా ఐపీఎల్ మార్కెట్ విలువ మరోసారి ఎంత భారీ స్థాయిలో ఉందో ఈ డీల్ ద్వారా స్పష్టమైంది.

# దేశాన్ని నడిపే సామర్థ్యం కలిగిన నాయకుడి సారథ్యంలో పనిచేస్తున్నాం

- కాఫీ విత్ కబుర్లు కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- పార్టీ కార్యకర్తలకు గౌరవమే ప్రధానం
- టీడీపీలో ప్రతి కార్యకర్తకు గౌరవం లభిస్తుంది
- పార్టీ కార్యకర్తలు నైరాశ్యం అందాల్సిన అవసరం లేదు
- పార్టీ అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలే తలమానికం



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన "కాఫీ విత్ కబుర్లు" కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో స్నేహపూర్వకంగా ముచ్చటిస్తూ పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల గురించి కార్యకర్తలకు వివరించారు. పింఛన్లను సమయానికి కాకుండా ముందుగానే పంపిణీ చేయడం ద్వారా లబ్ధిదారులకు మరింత ఉపశమనం కలిగిస్తున్నా మని తెలిపారు. అలాగే పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా వారి భవిష్య త్తుకు తోడ్పడుతున్నా మని పేర్కొన్నారు.

పార్టీలో పదవులు ముఖ్యం కాదని, ప్రతి కార్యకర్త సమానమేనని మంత్రి స్పష్టం చేశారు. దేశాన్ని నడిపించే సామర్థ్యం కలిగిన నాయకత్వంలో మనం పనిచేస్తున్నామనే గర్వం ప్రతి కార్యకర్తలో ఉండాలని ఆయన అన్నారు.
టిడిపి పార్టీలో కార్యకర్తలకు గౌరవమే ప్రధానమని, ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు. పార్టీ కార్యకర్తలు ఎలాంటి నైరాశ్యానికి లోనవ్వాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రానికి తలమానికంగా నిలుస్తాయని మంత్రి పేర్కొన్నారు.



## విజయవంతంగా ముగిసిన 'రైతన్న మీ కోసం'

### - మండల వ్యవసాయ అధికారి జీపీ ఓబులేసు

**వేముల - సూర్య వాస్తవం:** వేముల మండలంలో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని విజయవంతంగా ముగిసిందని మండల వ్యవసాయ అధికారి జిపి ఓబులేసు తెలిపారు. బుధవారం వేముల మండలంలోని వి.కొత్తపల్లిలో రైతన్న మీకోసం చివరి రోజు విజయవంతంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 6224 మంది రైతులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు, 23 నుంచి 25వ తేదీ వరకు రైతన్నా మీకోసం కార్య క్రమాన్ని చేపట్టి ప్రతి గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధకశాఖ అసి స్టెంట్లు, సచివాలయ అధికారులు, గ్రామ అభ్యుదయ రైతు సహకార సంఘం సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులతో గ్రామ కమిటీగా టీమ్‌లుగా ఏర్పడి ఒక్కొక్క టీమ్ రోజు రైతుల ఇళ్లకు వెళ్లి నీటి భద్రత, డిమాండ్, ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసిసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు వంటి అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు నిర్వహించి యాక్షన ప్లాన గురించి అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సురేశ్రప్ప, కృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాలో మెరిసిన వేంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కుసుమాలు



**వేంపల్లె - సూర్య వాస్తవం:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారంగా కడప కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్ మేళా సందర్భంగా కమిట్ స్టాఫింగ్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు నిర్వహించిన ఉద్యోగ ఎంపికలలో వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొనగా 25 మంది గాను 21 మంది ఉద్యోగ అర్హత సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర, కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ను టి.అరవింద్ విద్యార్థినీ విద్యార్థుల ను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపిక కాబడిన విద్యార్థిని విద్యార్థులను అధ్యాపక సిబ్బంది అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

## వైయస్సార్ కూతురవ్వడం వల్లనే షర్మిలకు పీసీసీ పదవి

### - జడ్పీటీసి తాటిగుట్ల శివప్రసాద్ రెడ్డి




**చక్రాయపేట- సూర్య వాస్తవం:** దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కూతురు అవ్వడం వల్లనే షర్మిలకు పీసీసీ పదవి ఇచ్చారనే విషయాన్ని షర్మిల గుర్తించు కోవాలని జడ్పీటిసి తాటిగుట్ల శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ వైకాపా నాయకులను, కార్యకర్తలను సైతాన్ సైన్యమని, మొరిగే కుక్కలని పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల దిగజారుడు మాటలు మాట్లాడటం శోచనీయ మన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి ఎమ్మెల్యే దగ్గర నుంచి ఆయన చనిపోయేంత వరకు కార్యకర్తలంతా ఆయన వెంట నడిచామని, అనంతరం ఆయన కుమా రుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి వెంట నడుస్తున్నామని అన్నారు. గత ఎన్నో సంవత్సరాలుగా కార్యకర్తలు వైయస్ కుటుంబం వెంటే ఉన్నారని, అటువంటి కార్యకర్తలను వైయస్ కుటుంబం లో పుట్టిన నీవు దిగజారుడు మాటలు మాట్లాడటం ఎంత వరకు సమంజసమని సూటిగా ప్రశ్నించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి కూతురు అవ్వడం వల్లనే నీకు పీసీసీ పదవి ఇచ్చారనే విషయాన్ని గుర్తించుకోవాలని అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి వెంట నడిచే సైన్యాన్ని విమర్శిస్తే వైయస్సార్ ను విమర్శిం చినట్లే నని తెలిపారు. గత రెండు రోజులుగా జిల్లాలో పర్యటిస్తుంటే నీ వెంట జనం ఉన్నారా అని ప్రశ్నించారు. ఇలాంటి దిగజారుడు మాటలు మాట్లాడితే జనాలు ఎలా వస్తారని అన్నారు. నీవు జగన్ మోహన్ రెడ్డి పైన, వైయస్ భారతి పైన విమర్శలు చేస్తున్నావు. వైయస్ కుటుంబంలో పుట్టి ఇలాంటి దిగజారుడు మాటలు, విమర్శలు చేయడం షర్మిల కు తగదని అన్నారు. ఇప్పటికైనా ఇలాంటి దిగజారుడు మాటలు మానుకోవాలని జడ్పీటిసి తాటిగుట్ల శివప్రసాద్ రెడ్డి హితవు పలికారు.

## దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి స్పాట్ విధులు వద్దు

### - డీఈఓ ప్రసాద్ బాబుకు ఎస్టీయూ వినతి



**అనంతపురం ఎడ్యుకేషన్ - సూర్య వాస్తవం :** దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు పదోతరగతి స్పాట్ వాల్యూయేషన్ విధుల నుంచి మినహాయింపు నివ్వాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి కోరారు. ఈ మేరకు అనంతపురం డీఈఓ ప్రసాద్ బాబును బుధవారం సాయంత్రం కలసి వినతిపత్రాన్ని అందజేశారు. డీఈఓతో పాటు ఏడీ-1, 2 కడప మునీర్ ఖాన్, శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణా రెడ్డి మాట్లాడుతూ.. పదో తరగతి స్పాట్ వాల్యు యేష న్‌కు దీర్ఘ కాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్న వారిని, చంటి పిల్లల తల్లులు, చైల్డ్ కేర్ లీవ్ లో ఉన్న వారిని, గుండె సంబంధిత, క్యాన్సర్, నరాల, కంటి జబ్బులతో బాధ పడుతున్న వారి విషయంలో మానవతా దృక్పథంలో ఆలో చించి, మినహాయింపునివ్వాలని కోరారు. అటువంటి వారి జాబితా ముందుగా తెప్పించుకొని స్పాట్ వాల్యు యేషన్‌కు కేటాయించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. వివిధ డీఎస్సీలలో ఎంపికై, ఇంతవరకు రెగ్యు లరైజేషన్ లిస్టులు విడుదల చేయని వారిని రెగ్యులర్ చేసి జాబితా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. గత విద్యా సంవత్సరం స్పాట్ వాల్యుయేషన్ కు హాజరైన వారికి రెమ్యునరేషన్ తక్షణం రిలీజ్ చేయాలని కోరారు. పదవ తరగతి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో రెండో శనివారం, ఆదివారం విధులకు హాజరైన ఉపాధ్యాయు లకు లీవ్ యాప్‌లో సీసీఎల్‌లు పొందుపరిచేలా ప్రధానో పాధ్యాయులకు ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిని డీఈఓకు అందజేశారు. దీనిపై డీఈఓ ప్రసాద్ బాబు స్పందిస్తూ... పరిశీలించి తన పరిధిలో ఉన్న వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పాలసీకి సంబంధించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వారికి సూచించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సూర్యుడు, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యుడు రాజశేఖర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి మల్లికార్జున, రాష్ట్ర కౌన్సిలర్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.




## భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సభ

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** పీడీఎస్‌యు ఆధ్వర్యంలో షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతిని పురస్కరించుకుని రాష్ట్ర కార్యవర్గం పిలుపుమేరకు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మూడవరోజు బుధవారం మాసాపేటలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న మాట్లాడుతూ విప్లవ వీరుల త్యాగాలు యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని, సమానత్వం, స్వేచ్ఛ కోసం వారి పోరాటం నేటికీ మార్గదర్శకమని తెలిపారు. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులను ఖండిస్తూ యుద్ధ చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి హానికరమైన భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని కోరారు. మార్చి 23 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చందు, జస్వంత్, సురేష్, సిద్ధార్థ, గౌస్, ఇర్షాద్, నాగార్జున రెడ్డి, అర్షద్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## నంది పురస్కారం అందుకున్న చిన్నారిని అభినంధించిన వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి ఈ నెల 8వ తేదీన హైదరాబాద్‌లోని త్యాగరాయ గానా సభలో మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఉగాది పురస్కారాలకు గుత్తి మండల పరిధిలోని జక్క లచెరువు గ్రామంలోని నిరుపేద కు టుంబానికి చెందిన సాంబశివుడు, అనిత దంపతులకు జన్మించిన చిన్నారి అనుదీప్తి నృత్య విభాగంలో తన గొప్ప నృత్య ప్రతిభతో అందరిని అలరించి ఉగాది నంది పురస్కారాన్ని అందుకుంది. ఈ విషయం తెలుసుకున్న గుత్తి మండలం సూరశిం గన పల్లి గ్రామానికి చెందిన అనంత పురం జిల్లా వైసీపీ ఉపాధ్యక్షురాలు చంద్రగిరి రాధా యాదవ్ జక్కల చెరువు గ్రామానికి వెళ్లి చిన్నారి అను దీప్తిని, వారి తల్లితండ్రులను సన్మానించి చిన్నారికి ఆర్థిక సాయం అందించారు. అలాగే వారికీ ముమ్ముందు మరింత స్థాయికి వెళ్ళాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఆర్ డాన్స్ అకాడమీ డాన్స్ మాస్టర్ రవి, తల్లితండ్రులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : Md.SHAFI AHMED, SEETAL APARTMENT, TF2 LABBIPETA VIJAYAWADA, BESIDE DR.Y.V.RAO HOSPITAL
ANDHRA PRADESH - 515001. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )

# ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- భూ సమస్యలు, ఇళ్ల పట్టాల పంపిణీపై అధికారులకు ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ ఆదేశాలు
- అంబేద్కర్ భవనం నిర్మాణానికి స్థల సేకరణ పనులు వేగవంతం చేయాలి





**నాయుడుపేట– సూర్య వాస్తవం:** ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఉన్నతస్థాయి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ అధ్యక్షత వహించగా, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సత్యవేడు ఎమ్మెల్యే కె. ఆదిమూలం, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరయ్యారు. సమావేశంలో జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి సంబంధించి అమలవుతున్న పథకాలు, సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా భూ వివాదాలు, భూముల హక్కులకు సంబంధించిన ఇబ్బందులు మరియు ఇళ్ల పట్టాల పంపిణీలో ఎదురవుతున్న ప్రతిబంధకాలను వెంటనే తొలగించి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. దళితులు, గిరిజన వర్గాల ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకుండా చూడటం ప్రభుత్వ బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన భూములపై వివాదాలు ఉన్న చోట వాటిని చట్టపరంగా పరిశీలించి తక్షణమే పరిష్కారం చూపాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. అలాగే ఇళ్ల పట్టాల పంపిణీ విషయంలో ఆలస్యం లేకుండా పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని అన్నారు.

అదేవిధంగా నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సామాజిక, సాంస్కృతిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవనం నిర్మాణానికి సంబంధించిన అంశాన్ని కూడా ఎమ్మెల్యే సమావేశంలో ప్రస్తావించారు. ఈ భవనం నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడం పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. స్థల సేకరణకు సంబంధించిన పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు. అంబేద్కర్ భవనం నిర్మాణం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలకు సామాజిక కార్యకలాపాలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు అనువైన వేదిక లభిస్తుందని ఆమె తెలిపారు. ఇది వారి అభివృద్ధికి దోహదపడే ముఖ్యమైన కార్యక్రమమని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విజయశ్రీ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అవి నిజమైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై నమ్మకం మరింత పెరుగుతుందని ఆమె అన్నారు. సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొని తమ శాఖలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి సంబంధించి తీసుకుంటున్న చర్యలు మరియు భవిష్యత్ కార్యాచరణపై సమీక్ష నిర్వహించారు. అధికారులు ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కట్టుబడి పనిచేయాలని ఈ సందర్భంగా సూచనలు జారీ చేశారు.



# సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి భేటీ

- యువతలో మంచి ఆలోచనలు, సానుకూల దృక్పథం పెంపొందించే బాధ్యత ఇన్‌ఫ్లుయెన్సర్లదే : మంత్రి



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌తో భేటీ అయ్యారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సమాజంపై సోషల్ మీడియా ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో యువతలో మంచి ఆలోచనలు, సానుకూల దృక్పథం పెంపొందించే బాధ్యత ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఉందని తెలిపారు. సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకొని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

# కుప్పంలో పరిశ్రమ ప్రారంభానికి శ్రీకారం చుట్టిన శ్రీజ సంస్థ

- శ్రీజ ప్లాంట్స్‌కు భూమి పూజ నిర్వహించిన సంస్థ ప్రతినిధులు

**గుడిపల్లి – సూర్య వాస్తవం:** – శ్రీజ మహిళా మిల్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ వారి శ్రీజ క్యాటిల్ ఫీడ్ ప్లాంట్, శ్రీజ పాల పౌడర్ ప్లాంట్స్‌కు ఆ సంస్థ ప్రతినిధులు బుధ వారం భూమి పూజ చేశారు. నియోజకవర్గ పరిధిలోని గుడిపల్లి మండలంలో పొగురుపల్లి గ్రామం వద్ద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకారంతో కుప్పం డెవల ప్మెంట్ అథారిటీ (కడ) కేటాయించిన 50 ఎకరాల భూమి లో ప్రహరీ గోడ భూమి నిర్మాణం కోసం పూజా కార్య క్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సీఈవో తిమ్మప్పసురా, డిప్యూటీ సీఈవో కృతిక, హెడ్ ప్రొక్యూర్మెంట్ రాజేంద్ర బాబు,వై.కృపాకర్ రావు (హెడ్





ఇంజనీరింగ్ సర్వీసెస్ అండ్ (ప్రాజెక్ట్),నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డ్ నుంచి దావల్ పృథ్వి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీజ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తిమ్మప్పసురా, మాట్లాడుతూ శ్రీజ క్యాటిల్ ఫీడ్,శ్రీజ పౌడర్ ప్లాంట్ పరిశ్రమలను రాబోయే రెండు సంవత్సరాలలో పూర్తి చేస్తామని ఈ సంవత్సరం జూన్ లో బిల్డింగ్ ప్రధాన భూమి పూజ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు.అలాగే శ్రీజ మహిళా యజమానులకు నాణ్యమైన శ్రీజ క్యాటిల్ ఫీడ్ పాలతో శ్రీజ పాల పౌడర్ ప్లాంట్స్‌ని అందుబాటులో తీసుకొస్తామని ఇది 1, 25,000 మంది శ్రీజ మహిళా యజమానుల ఆస్తిని చెప్పారు,ప్రస్తుతం కుప్పం ప్రాంతం నందు ఒకటిన్నర లక్ష లీటర్ల పాల సేకరణ శ్రీజ సేకరిస్తుందని దీనిని రాబోయే రెండు సంవత్సరాలలో నాలుగు లక్షల లీటర్ల వరకు తీసుకెళ్తామని శ్రీజ మహిళా యజమానులకు చెప్పారు.ఈ కార్యక్రమంలో శ్రీజ మహిళా యజమానులు మరియు ఏరియా సిబ్బంది పాల్గొన్నారు.

# రెవెన్యూ పవర్ ప్లాంట్ రైతులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**గుత్తి – సూర్య వాస్తవం:** గుత్తి మండలం బాచుపల్లి గ్రా మంలో గుంతకల్ నియోజకవ ర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జ యరాం బాచుపల్లి గ్రామంలో రెవెన్యూ పవర్ ప్లాంట్‌కు భూములు ఇచ్చిన రైతన్నలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గ్రామంలోని 23 మంది రైతులకు రెన్యూ పవర్ ప్లాంట్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రెన్యూ పవర్ ప్లాంట్‌కు భూములు ఇచ్చినందుకు గాను రైతన్నలందరికీ హృదయ పూర్వక ధన్యవాదములు రాష్ట్ర అభివృద్ధి కొరకు మన యువ నాయకుడు మంత్రి నారా లోకేష్ మన నియోజ కవర్గంలో ఈ రిన్యూ ప్రాజెక్టును తీసుకురావడం జరిగిందని ఈ ప్రాజెక్టు ముందుకు సాగాలంటే రైతన్నలు తమ వంతుగా భూములు ఇస్తేనే అభివృద్ధి అనేది సాధ్యపడుతుందని ఇంకా మిగిలిన రైతన్నలు కూడా ఎటువంటి అపోహలకు పోకుండా భూములు ఇచ్చి రాష్ట్ర అభివృద్ధికి అలాగే మన నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుత్తి మండల మరి యు పట్టణ కూటమి నాయ కులు కార్యకర్తలు మరియు బాచుపల్లి గ్రామ రైతన్నలు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

# ఆద్యాంతం వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

- రామనామ స్మరణతో మార్మోగిన దౌలాతాపురం
- అత్యంత వైభవంగా శ్రీ సీతారామ లక్ష్మణ సమేత వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట
- ప్రత్యేక పూజలు నిర్వహించిన కాశీభట్ల సత్యసాయి నాథ్ శర్మ సతీమణి ప్రశాంతి



**చెన్నూరు– సూర్య వాస్తవం:** దౌలతాపురం గ్రామం భక్తి పారవశ్యంతో జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగింది. శ్రీ సీతా రామలక్ష్మణ సమేత వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం గ్రామ ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామం అంతా రామనామ స్మరణతో నిండిపోయి, ప్రతి వీధి ఆధ్యాత్మిక కాంతితో మెరిసింది. వేద మంత్రాలు, మంగళ వాయి ద్యాలు, హోమ యజ్ఞాలు భక్తుల హృదయాలను భక్తి భావంతో ముంచెత్తాయి. ఈ మహోత్సవంలో కాశీభట్ల సత్యసాయి నాథ్ శర్మ సతీమణి ప్రశాంతి ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళలు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని కాయ కర్పూరం అందజేశారు. అలాగే మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ భక్తి భావాన్ని చాటు కున్నారు. విగ్రహ పరిస్థితి మహోత్సవ సందర్భంగా గ్రామం మొత్తం పండుగ వాతావరణాన్ని సంతరించుకుని, శ్రీ రామభక్తి గీతాలు, భజనలు, హరినామ సంకీర్తనలతో దౌలతాపురం భక్తి పారవశ్యంలో “అంతా రామమయం”గా మారింది. ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం అనంతరం భక్తులకు, ప్రజలకు అన్నప్రసాద వితరణ ఘనంగా నిర్వహించగా, వందలాది మంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని విజయ వంతంగా నిర్వహించి భక్తులకు మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని అందించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి దాదిరెడ్డి భాగ్యమ్మ, కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ మహాసభలు జయప్రదం చేయాలి



**పులివెందుల రూరల్ – సూర్య వాస్తవం:** ఏప్రిల్ 8వ తేదీ కడపలో జరిగే యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ( హెచ్–176 సి ఐ టి యూ ) 3వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని పిలుపునిస్తూ, పులివెందుల డివిజన్ ఆఫీస్ డి ఈ ప్రసాద్ రెడ్డి ని కలిసి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు దశాబ్దాల తరబడి విద్యుత్ సంస్థను నమ్ముకొని ఎప్పటికైనా పర్మినెంట్ చేస్తారన్న ఆశతో బానిసలుగా పనిచేస్తున్నారు. కాని విద్యుత్ యాజమాన్యం, ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎన్నికల్లో హామీలు ఇవ్వడం, తరువాత మర్చిపోవడంతో మన బ్రతుకుల్లో ఎటువంటి మార్పు లేకుండా ఉంది. ఈ నేపథ్యంలో సిఐటియు, ఇఫీ ఫెడరేషన్గా విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల్ని తెలంగాణా తరహాలో సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని నికరంగా పోరాడుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఇప్పటికి కాంట్రాక్ట్ కార్మికులకు సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. పిఆర్సి ఇచ్చే సందర్భంలో కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం జరుగుతోందని జరగబోవు మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ముజఫర్ అహ్మద్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు నాయబ్ రసూల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె శ్రీనివాసులు పులివెందుల సబ్ డివిజన్ నాయకులు మల్లికార్జున బి రవి కిరణ్ , హరి, గంగాధర తదితరులు పాల్గొన్నారు.